

ఎయిరిండియా దుర్ఘటనలో కుట్రకోణంపైనా దర్యాప్తు : కేంద్రం 03

www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

RNI No: TELTEL/2024/86684

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 30.06.2025 | సంపుటి : 2 | సంచిక :148 | పేజీలు : 8 | వెల : 2/-



# నక్సలైట్లు ఆయుధాలు వీడేదాకా చర్చలుండవు


## మావోయిస్టుల అడ్డాగా రాష్ట్రాన్ని మార్చొద్దు

### రేవంత్‌నుద్దేశించి అమిత్‌షా వ్యాఖ్య

### కొందరు కాంగ్రెస్ వాళ్లు శాంతిచర్చలు అంటున్నారు

### మావోయిస్టుల చేతిలో ప్రాణాలొదిలిన ఆదివాసీ కుటుంబాలకు ఏం చెబుతారు?

### 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని తుదముట్టిస్తాం



- బీఆర్ఎస్ పోయినా అవినీతి పోలేదు
- కాంగ్రెస్ పాలనలోనూ కొనసాగుతోంది
- తెలంగాణను ఏటీఎంగా మార్చుకున్న ఢిల్లీ కాంగ్రెస్
- రాష్ట్రంలో బీజేపీ సర్కారు వస్తేనే అవినీతి అంతం
- ప్రధాని మోదీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు
- పసుపు బోర్డును నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేశారు
- భవిష్యత్తులో ప్రపంచమంతా పసుపు ఎగుమతి
- నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఆఫీసు ప్రారంభం
- డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్ర హోంమంత్రి
- షాను కలిసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నం
- ఢిల్లీలో అత్యవసర పని ఉందంటూ వెళ్లిపోయిన షా

**నిజామాబాద్, జూన్ 29 :** నక్సలైట్లు తక్షణమే హింసను వీడి లొంగిపోవాలని, జనజీవన స్రవంతిలోకి రావాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. ఆదివాసీలు, ఇతర వర్గాలపై నక్సల్స్ హత్యాకాండకు పాల్పడుతున్నారని, ఆయుధాలు వదిలేసేంత వరకూ వారితో చర్చలు ఉండబోవని స్పష్టం చేశారు. లొంగిపోతే పునరావాసం కల్పిస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 10 వేల మంది నక్సలైట్లు లొంగిపోయారని వెల్లడించారు. 2026 మార్చిలోపు దేశంలో నక్సలిజం లేకుండా చేస్తామని ప్రకటించారు. ఆదివారం నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయాన్ని అమిత్ షా ప్రారంభించారు. ఆ తర్వాత బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన డి.శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించిన కిసాన్ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నక్సలైట్లకు మద్దతుగా మాట్లాడేవారు బాధిత కుటుంబాల పరిస్థితిని తెలుసుకోవాలని హితవు పలికారు. గిరిజన బిడ్డలను, పోలీసులను చంపినప్పుడు వారి తరఫున ఎవరూ మాట్లాడలేదని, కానీ.. ఇప్పుడు చర్చల కోసం చాలా మంది పిలుపునిస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను నక్సలైట్ల అడ్డాగా మార్చవద్దని సూచించారు. 'ఆపరేషన్ సిందూర్' తో పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పామని అమిత్‌షా తెలిపారు. అయితే పాకిస్థాన్ మాట.. రాహుల్‌గాంధీ నోట వినిపిస్తోందని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పాలన పోయిందిగానీ.. అవినీతి మాత్రం పోలేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ అవినీతిని సహించకుండా ఆ పార్టీని గద్దె దింపితే..

మిగతా 2 లో

## రేవంత్‌పై ఎందుకు విచారణకు ఆదేశించడం లేదు

- కాంగ్రెస్ పెద్దలకు ఏటీఎంగా రేవంత్ సర్కార్ అని మీరే అంటారు..
- కేంద్ర దర్యాప్తు సంస్థలు మీ వద్దే ఉన్నాయి
- షా ఎందుకు స్పందించరు? : కేటీఆర్

02



తెలంగాణలోని రేవంత్ సర్కారు.. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు ఏటీఎంగా మారిందని ఆరోపించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ అంశంపై ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్ర అత్యున్నత దర్యాప్తు సంస్థలైన సీబీఐ,ఈడీతో అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వంపై విచారణ జరపడానికి కేంద్రానికి ఏం అడ్డువస్తుందో తెలంగాణ ప్రజలకు వివరించాలని అని కేటీఆర్ అన్నారు. ఢిల్లీలో కాంగ్రెసతో బీజేపీ కుస్తీ, తెలంగాణలో మాత్రం దోస్తీ అన్నట్లుగా సాగుతున్న కుమ్మక్కు రాజకీయాల వల్లే రేవంత్‌ను వెనకేసుకుని వస్తున్నారనే ఆరోపణలకు సమాధానం ఉందా అని ఆదివారం ఆయన ఎక్స్‌లో ప్రశ్నించారు. నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎసను ఒంటరిగా ఎదుర్కోలేక, రేవంత్‌ను బీజేపీ పావుగా వాడుకుంటున్న మాట వాస్తవం కాదా అని నిలదీశారు.


## భాజపా అధ్యక్షుడు ఎవరో తేలేది నేడే

### రామచందర్‌రావు, ఈటలలో ఒకరికి అవకాశం

**హైదరాబాద్, జూన్ 29 :** భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవికి తుది రేసులో ఇద్దరి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌లలో ఒకరికి అవకాశం దక్కే వీలుందని విశ్వసనీయ సమాచారం. కాబోయే నూతన అధ్యక్షుడికి సోమవారం ఉదయం జాతీయ నాయకత్వం నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందనున్నట్లు తెలిసింది. రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం నియమితులైన ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు.



మిగతా 2 లో



## 4న ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ సభ

- గ్రామస్థాయి పార్టీ అధ్యక్షుల సమ్మేళనానికి రానున్న ఖర్గే
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడి

## మెడికోలకు ఉపకారం

- 15% స్టైపెండ్ పెంపు.. జీవో జారీ
- ప్రతి నెలా 10 లోపు జమ.. మంత్రి ఆదేశం
- జూడాల హర్షం.. దామోదరకు కృతజ్ఞతలు



**హైదరాబాద్, జూన్ 29 :** రాష్ట్రంలో వైద్య విద్యార్థులకు అందిస్తున్న ఉపకార వేతనాన్ని 15శాతం మేర పెంచుతూ రాష్ట్ర సర్కారు నిర్ణయ్ణం తీసుకుంది. అలాగే వైద్య, దంత హౌజ్‌సర్జన్స్‌తో పాటు, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాన్ని రూ.92,575 నుంచి రూ.1,06461కి పెంచారు. ఈ మేరకు ఆదివారం జీవో జారీ చేశారు. జీవోలోని వివరాల ప్రకారం.. ఇంటర్న్‌లకు ప్రస్తుతం నెలకు రూ. 25,906 ఉపకార వేతనం ఇస్తుండగా దాన్ని రూ.29,792కు పెంచారు. పీజీ డాక్టర్లకు ప్రథమ సంవత్సరంలో ఇస్తున్న రూ. 58,289 మొత్తాన్ని రూ.67,032కు, ద్వితీయ సంవత్సరంలో ఇస్తున్న రూ.61,528 మొత్తాన్ని రూ.70,757కు, ఫైనల్ ఇయర్‌లో ఇస్తున్న రూ.64,767 మొత్తాన్ని రూ.74,782కు పెంచారు. సూపర్ స్పెషాలిటీ విద్యార్థులకు మొదటి ఏడాదిలో రూ. 92,575 ఇస్తుండగా, దాన్ని రూ.1,06,461కు, సెకండ్ ఇయర్‌లో రూ. 97,204 ఇస్తుండగా దాన్ని రూ.1,11,785కు, థర్డ్ ఇయర్‌లో రూ. 101824 ఇస్తుండగా, దాన్ని .1,17,103కు పెంచారు. సీనియర్ రెసిడెంట్లకు డాక్టర్లకు

మిగతా 2 లో



## నకిలీ ధ్రువపత్రాలతో కేంద్ర భద్రతా బలగాల్లో ఉద్యోగాలు

- ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన 9 మందిపై ఆదిలాబాద్‌లో కేసు
- సహకరించిన ముగ్గురు స్థానికులకు రిమాండ్

## వెయిటింగ్ లిస్ట్ కుదింపుపై రైల్వేలో పెదవి విరుపు



రైళ్లలో ప్రయాణికుల వెయిటింగు లిస్టులను 25 శాతానికి పరిమితం చేసిన నిర్ణయాన్ని పలువురు విమర్శిస్తున్నారు. ఈ నిర్ణయం ఆర్థికంగా లాభదాయకం కాదని, ప్రయాణికులకు అసౌకర్యంగా ఉంటుందని పెదవి విరుస్తున్నారు. ఈ నెల 16 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధన ఆచరణాత్మకంగా లేదని రైల్వే రిజర్వేషన్ విభాగాధికారులు సైతం చెబుతున్నారు.

03



02

## నేనే భాజపా రాష్ట్ర అధ్యక్షుడినైతే..

చర్చనీయాంశమైన ఎమ్మెల్యే రాజాసింగ్ వీడియో




03

## 'ఉచిత ల్యాప్‌టాప్' పేరిట వల

- కేంద్రం హెచ్చరిక

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# నేనే భాజపా రాష్ట్ర అధ్యక్షుడినైతే..

## చర్చనీయాంశమైన ఎమ్మెల్యే రాజాసింగ్ వీడియో



**హైదరాబాద్:** భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా తనను నియమించాలని కోరుతూ.. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విడుదల చేసిన ఓ వీడియో చర్చనీయాంశమవుతోంది. అందులో రాజాసింగ్ ఏమన్నారంటే.. 'నన్ను అధ్యక్షుడిగా చూడాలని చాలా మంది కార్యకర్తలు ఫోన్లు చేస్తున్నారు. అందుకే నాకో అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నా. నన్ను నియమిస్తే.. పార్టీలో గోరక్షణ విభాగాన్ని ఏర్పాటు చేస్తా. గోరక్షణకు పాటుపడే కార్యకర్తలకు రక్షణగా నిలబడతా. భాజపా అవసరాన్ని గడపగడప కు చాటిచెబుతా. మనది హిందుత్వ, కాషాయ పార్టీ అని ప్రచారం చేస్తా. మన ప్రభుత్వం వస్తే యోగి ఆదిత్యనాథ్‌లా పనిచేస్తాం. ఎన్నికలకు ఆర్నెల్ల ముందే అభ్యర్థులను ప్రకటిస్తాం. అధ్యక్ష పదవి ఎవరికిచ్చినా అభ్యంతరం లేదు. వీఐపీలా ఉండే వారు కాకుండా.. హిందుత్వం కోసం పనిచేసే వ్యక్తినే నియమిస్తే బాగుంటుంది. రాజాసింగ్ అధ్యక్షుడు కావొద్దని అడ్డుకునే ఒక బృందం పనిచేస్తోంది' అంటూ ముగించారు.

## నాయకత్వాన్ని తిట్టడం

# కొండా కుటుంబానికి అలవాటు

- సోనియానూ దూషించిన చరిత్ర వారిది
- అధిష్ఠానం నిర్ణయం కోసం జులై 5 వరకు వేచి చూస్తాం
- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- అత్యవసరంగా సమావేశమై చర్చించిన ఓరుగల్లు కాంగ్రెస్ నేతలు



**హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో తలెత్తిన విభేదాలు ఇప్పట్లో సద్దుమణిగేలా లేవు. అధిష్ఠానం నచ్చజెప్పినా ఎవరూ తగ్గడం లేదు.. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి హైదరాబాద్ గాంధీభవన్‌లో శనివారం పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవిని కలిసిన అనంతరం చేసిన వ్యాఖ్యలపై పలువురు ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో అత్యవసరంగా సమావేశమై గంటకుపైగా చర్చించారు. స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట, పరకాల ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి దీనికి హాజరయ్యారు. సమావేశం అనంతరం సారయ్య మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్ పార్టీ నుంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోయిన చరిత్ర కొండా కుటుంబానిది.. శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గ ఎమ్మెల్యేలను గెలిపించేది తమ కుటుంబం అని మురళి మాట్లాడటం హాస్యాస్పదం. క్రమశిక్షణ కమిటీకి ఆయన తప్పుడు సమాచారం ఇచ్చారు. అవకాశం కోసం కొండా దంపతులు అన్ని పార్టీలు మారారు. ఇంతకాలం వారు కాంగ్రెస్ పార్టీకి చేసింది ఏమిటో చెప్పాలి. అగ్రనేత సోనియా గాంధీని సైతం దూషించిన చరిత్ర వారిది. కులాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుకొంటున్నారు. క్రమశిక్షణ కమిటీకి ఆ కుటుంబంపై విశ్వాసం లేదు. పిచ్చి పిచ్చి మాటలు మానుకోవాలి. ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ నాయకత్వాన్ని తిట్టడం వారికి అలవాటు. కొండా మురళిపై అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందో జులై 5వ తేదీ వరకు వేచి చూస్తాం. పార్టీ డైరెక్షన్‌లో మేమంతా పని చేస్తున్నాం. ఎవరో చెబితే మేము మాట్లాడటం లేదు. దమ్ముంటే మురళి కొత్త పార్టీ పెట్టాలి" అని సవాల్ విసిరారు.

### ఎమ్మెల్యేలపై కొండా మురళి సవారీ సరికాదు: కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలపై కొండా మురళి సవారీ చేయడం సరికాదన్నారు. తన నియోజకవర్గంలో కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించి వేధిస్తున్నట్లు తెలిపారు. స్వర్ణ మాట్లాడుతూ.. కుండెడు పాలల్లో విషం చుక్కలాగా మురళి మారారని అన్నారు. ఆయనకు ప్రాణభిక్ష పెట్టిన సీనియర్ నేత, మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో ఏం జరిగిందని మీడియా ప్రతినిధులు అడగగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి 'నో కామెంట్' అన్నారు. కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డిని అడగగా.. జులై 4న హైదరాబాద్‌లో జరిగే సభకు జన సమీకరణపై చర్చించినట్లు తెలిపారు. కొండా మురళి నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలని స్పష్టం చేశారు.

## జూరాల గేట్లకు

# మరమ్మతులూ చేయలేని కాంగ్రెస్

### మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి



**ఆత్మకూరు :** జూరాల జలాశయంలో పూడిక తొలగించలేని కాంగ్రెస్ ప్రభుత్వం గేట్లకు మరమ్మతులు కూడా పూర్తి చేయలేకపోయిందని మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారని.. ఆయన ఆనవాళ్లు లేకుండా చేయడమంటే తెలంగాణ ఆనవాళ్లు లేకుండా చేయడమేనన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా అమరచింతలో తెలంగాణ ఉద్యమ గాయకుడు దివంగత సాయిచంద్ విగ్రహావిష్కరణ సభలో వారు మాట్లాడారు. జై తెలంగాణ అనలేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 'నై తెలంగాణ' అంటున్న ప్రభుత్వం ఎక్కువ రోజులు మనుగడ సాధించలేదని చెప్పారు. మళ్లీ 'జై తెలంగాణ' అనే ప్రభుత్వమే రావాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. ఏపీలో చంద్రబాబు పాలన తెలంగాణలో ఆయన శిష్యుడి పాలన సాగుతోందన్నారు. ఇప్పటికే కృష్ణా జలాలు ఆంధ్ర పాలకులు దోపిడీ చేయగా, గోదావరి జలాలను సైతం దోచుకునేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, గొంగిడి సునీత, భారాస రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, గిడ్డంగుల సంస్థ మాజీ ఛైర్‌పర్సన్ రజిని తదితరులు పాల్గొన్నారు.

## నక్సలైట్లు ఆయుధాలు

# వీడేదాకా చర్చలుండవు

(మొదటిపేజీ తరువాయి)

ఆ స్థానంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ కూడా అవినీతి పాలననే కొనసాగిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, ధరణి వంటి వాటిని కుటుంబ ఏటీఎంగా మార్చుకున్నారని, పదేళ్లపాటు అన్ని రంగాల్లో దోపిడీకి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఇప్పుడు ఢిల్లీ కాంగ్రెస్.. తెలంగాణను తమ ఏటీఎంగా మార్చుకుందన్నారు. రాష్ట్రంలో అవినీతి అంతం కావాలంటే బీజేపీ సర్కారు రావాలన్నారు. ఎన్నికల సమయంలో నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసిన అర్వింద్ పసుపు బోర్డు కోసం హామీ ఇచ్చారని, ఆ హామీని ప్రధాని మోదీ నెరవేర్చారని అన్నారు. మోదీ ఏదైనా చెప్పారంటే చేసి చూపిస్తారని తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటుతో.. నిజామాబాద్ రైతుల 40 ఏళ్ల పోరాటం ఫలించిందని, వారి కల నెరవేరిందని పేర్కొన్నారు. ఇకపై ఇక్కడి రైతులు పండించే పసుపు ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి అవుతుందన్నారు. ఇందుకోసం మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్ వ్యవస్థలను ఏర్పాటు చేసి పసుపును ఎగుమతి చేస్తామన్నారు. ఇప్పటికే అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, వియత్నాంతోపాటు ఇతర దేశాలకూ పసుపు ఎగుమతి అవుతోందని తెలిపారు. భారత్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ ద్వారా యూరప్ దేశాలకు ఎక్కువగా ఈ ఎగుమతి కొనసాగుతోందని ఆయన వెల్లడించారు.

### అవినీతి యథాతథం

భారాస సర్కారు హయాంలో భారీ అవినీతి జరిగింది. ధరణి పోర్టల్, కాళేశ్వరం ప్రాజెక్టు, సింగరేణి, టీఎస్‌పీఎస్సీ తదితరాల్లో అవినీతి జరిగింది. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. గతంలో కేసీఆర్‌కు, ఆయన కుటుంబానికి తెలంగాణ ఏటీఎంగా మారింది. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి ఏటీఎంగా తయారైంది. భారాస పోయి కాంగ్రెస్ వచ్చినా అవినీతి మాత్రం పోలేదు. తెలంగాణ యువత, దళితులు, మహిళలు, బడుగు బలహీనవర్గాలవారు డబుల్ ఇంజిన్ సర్కారు రావాలని కోరుకుంటున్నారు. రానున్న కాలంలో తెలంగాణలో భాజపా అధికారంలోకి వస్తుంది. 2024లో మోదీ ఇచ్చిన హామీ మేరకు నిజామాబాద్ గడ్డపై జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేశాం. పసుపు ప్యాకేజింగ్, మార్కెటింగ్, ఎగుమతులకు ప్రత్యేక వ్యవస్థలు నెలకొల్పుతాం. నిజామాబాద్‌లో భారత్ ఎక్స్‌పోర్ట్స్, భారత్ ఆర్గానిక్ లిమిటెడ్ శాఖలను ఏర్పాటు చేయనున్నాం. రైతులను అమెరికా, స్విట్జర్లాండ్, యూకే, ఆస్ట్రేలియా తదితర దేశాలకు పంపిస్తాం. వారు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే మా లక్ష్యం.

### మోదీ పాలనలో దేశానికి రక్షణ

గతంలో కాంగ్రెస్ పాలనలో పాకిస్థాన్ ఉగ్రవాదులు మన దేశంలో దాడులు చేసి పారిపోయేవారు. మోదీ హయాంలో ఆ పరిస్థితి లేదు. ఉరీలో సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామాలో ఎయిర్ స్ట్రైక్స్, పహల్గాం ఘటన అనంతరం ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశాం. భారతీయులను ప్రశాంతంగా ఉండనీయబోమంటున్న పాకిస్థానీయుల ముఖాలు చూస్తే ఎవరికి ప్రశాంతత లేదో అర్థమవుతుంది. ఈ విషయాన్ని గ్రహించని రాహుల్ గాంధీ.. గత పదేళ్లుగా దేశాన్ని రక్షిస్తున్న మోదీని పదే పదే ప్రశ్నలు అడుగుతున్నారు" అని అమిత్‌షా అన్నారు.

### యూరియా కష్టాలను కేంద్రం తీర్చింది: కిషన్‌రెడ్డి

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని అన్నారు. గతంలో ఎరువుల కొరతతో రైతులు అల్లాడేవారని, ఈ నేపథ్యంలో యూరియా కష్టాలు తీర్చేందుకు కేంద్రం రూ.3,500 బస్తాను రాయితీపై రూ.260కే అందిస్తోందని తెలిపారు. అయినా, తెలంగాణకు మోదీ ఏం ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారని, కాంగ్రెస్‌కు సాధ్యం కాని పసుపు బోర్డును నిజామాబాద్ రైతులకు వరంగా మోదీ మంజూరు చేశారని ఆయన చెప్పారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ పసుపు అర్వింద్‌గా మారారని చమత్కరించారు. తెలంగాణ ప్రజలు అందరికీ అవకాశం ఇచ్చారని, వచ్చే ఎన్నికల్లో భాజపాకు అవకాశం కల్పించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు.

అంతకుముందు అమిత్‌షా నిజామాబాద్ వినాయక్‌నగర్‌లోని జాతీయ పసుపు బోర్డు నూతన కార్యాలయాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, ఎంపీ అర్వింద్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం బస్వా గార్డెన్‌లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో మాజీ మంత్రి డి.శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీలు ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్, లక్ష్మణ్, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు సూర్యనారాయణ, రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కొమరయ్య, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెడికోలకు ఉపకారం

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చే గౌరవ వేతనాన్ని రూ.92,575 నుంచి రూ.1,06,461 పెంచారు. స్టైపెండ్ పెంపుపై జూడాలు హర్షం వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదరను ఆయన నివాసంలో కలసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తాము తలపెట్టిన సమ్మెను ఉపసంహరించుకుంటున్నట్లు ఓ ప్రకటనలో జూడాలు తెలిపారు. కాగా వైద్య విద్యార్థులకు స్టైపెండ్‌ను ప్రతినెలా 10వ తేదీలోగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని అధికారులను మంత్రి దామోదర ఆదేశించారు. ఈ మేరకు ఏడాదికి సరిపడా స్టైయిపెండ్ చెల్లించేందుకు అవసరమైన బడ్జెట్ రిలీజ్ ఆర్డర్‌ను అధికారులు విడుదల చేశారు. మెడికోలకు ఇప్పటివరకు ఉన్న బకాయిలను కూడా విడుదల చేశారు. కాగా దక్షిణాదిన అత్యధిక స్టైఫండ్ చెల్లిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని వైద్య ఆరోగ్యశాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

### జూలై మొదటివారంలో ఎంసీఎంసీ నివేదిక

ప్రభుత్వ వైద్య కళాశాలపై తనిఖీల కోసం సర్కారు నియమించిన మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) బృందాలు ఇప్పటికే దాదాపు అన్ని జిల్లాల్లోనూ పర్యటించాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 29 వరకు తనిఖీలు ముగించి 30న నివేదికలివ్వాలి. తనిఖీలు చేయాల్సిన కాలేజీలు ఇంకొన్ని మిగిలిపోయినట్లు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. దాంతో జూలై మొదటివారంలో తనిఖీలు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికివ్వనున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.


# నకిలీ ధ్రువపత్రాలతో కేంద్ర భద్రతా బలగాల్లో ఉద్యోగాలు

- ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన 9 మందిపై ఆదిలాబాద్‌లో కేసు
- సహకరించిన ముగ్గురు స్థానికులకు రిమాండ్

**ఆదిలాబాద్ :** నకిలీ ధ్రువపత్రాలతో ఏకంగా కేంద్ర భద్రతా బలగాల్లో ఉద్యోగాలు పొందిన 9 మందిపై ఆదిలాబాద్ జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. వారికి సహకరించిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ కాజల్ సింగ్ తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. భద్రత బలగాల్లో జనరల్ డ్యూటీ(జీడీ) కానిస్టేబుళ్ల భర్తీకోసం 2023 డిసెంబరులో నోటిఫికేషన్ వచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడం, గిరిజనుల సంఖ్య అధికం కావడంతో పోటీ తక్కువగా ఉంటుందని ఉత్తరాది ముఠాలు దీనిపై దృష్టిపెట్టాయి. ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్‌కు చెందిన మాజీ సర్పంచి షేక్ ఫరీద్(59)ను సంప్రదించి స్థానిక ధ్రువపత్రాలు ఇప్పిస్తే రూ.లక్షల్లో ముట్టచెబుతామని ఆశచూపాయి. అతడు ఒప్పుకొని నకిలీ ఆధార్ సృష్టించి దాని ద్వారా తనకున్న పరిచయాలతో ఇతర ధ్రువపత్రాలను ఇప్పించాడు. ఇచ్చోడకు చెందిన షేక్ కలీం(34) సహకరించాడు. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌కు చెందిన యువకులు వీరి సాయంతో 10వ తరగతి మార్కులు, స్థానికత ధ్రువపత్రాలను తీసుకున్నారు. ఎంపికైన వారికి 2024లో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ క్రమంలో వారి ధ్రువపత్రాలు కేంద్రం నుంచి జిల్లా స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) పోలీసులకు వచ్చాయి. వారి పరిశీలనలో నకిలీ ధ్రువపత్రాల వ్యవహారం బయటపడింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో అక్రమంగా ఉద్యోగాలు పొందిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో మరో తొమ్మిది మంది నకిలీ పత్రాలతో ఉద్యోగాలు పొందినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్షచొప్పున తీసుకుని యువకులకు సహకరించిన ఫరీద్, కలీం వీరికి జతకలిసిన ఇస్లాంనగర్‌కు చెందిన జాదవ్ గజానంద్(35)ను శనివారం రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఉద్యోగాల్లో ఉన్నవారికి సైతం నోటీసులు పంపినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. ఇందులో ప్రభుత్వ సిబ్బంది పాత్ర ఏమైనా ఉందా అని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# 4న ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ సభ

- గ్రామస్థాయి పార్టీ అధ్యక్షుల సమ్మేళనానికి రానున్న ఖర్గే
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడి



**హైదరాబాద్:** జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమ్మేళనం పేరుతో జులై 4న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సభ నిర్వహించనున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. దీనికి పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతారని ఆయన ప్రకటించారు. ఆదివారం గాంధీ భవన్‌లో హైదరాబాద్ కాంగ్రెస్ నేతలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో, అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ "రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ చేపట్టిన జై సంవిధాన్ కార్యక్రమం తెలంగాణలో విజయవంతంగా సాగుతోంది. గాంధీభవన్‌లో జులై 4న పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ(పీఏసీ), అనంతరం పీసీసీ విస్తృత స్థాయి సమావేశాలు జరుగుతాయి. అదేరోజు సాయంత్రం ఎల్బీస్టేడియంలో 15,000 మంది గ్రామస్థాయి నేతలతో బహిరంగ సభ ఉంటుంది. దివంగత కాంగ్రెస్ నేత డి.శ్రీనివాస్(డీఎస్) భాజపాలో ఏనాడూ లేరు. అలాంటి నేత విగ్రహాన్ని భాజపా నాయకుడు అమిత్‌షాతో నిజామాబాద్‌లో ఆవిష్కరింపజేశారు. డీఎస్ ఆత్మ క్షోభిస్తుంది. విగ్రహ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వమే స్థలం కేటాయించినా కాంగ్రెస్ నాయకులెవరికీ ఆహ్వానం రాలేదు. జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ గెలుస్తుంది. మాజీ మంత్రి ముకేశ్‌గౌడ్ విగ్రహం హైదరాబాద్ లో ఏర్పాటు చేస్తాం" అని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కుమారుల చర్యల కారణంగా డీఎస్ ఆత్మ క్షోభిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజుల్లోపు పడిపోతుందని భారాస నేతలు శాపనార్థాలు పెడుతూ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలు చేశారని ఆరోపించారు. భారాస ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. అంతకుముందు డీఎస్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యనేతలంతా నివాళులర్పించారు.

## భాజపా అధ్యక్షుడు

# ఎవరో తేలేది నేడే

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ సోమవారం ఉదయం రానున్నారు. అధ్యక్ష ఎంపికలో కీలకమైన నామినేషన్ల ఘట్టం సోమవారం జరగనుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4 వరకు భాజపా రాష్ట్ర కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉంటుంది. నామినేషన్ వేసేది ఒకరేనని తెలిసింది. రాష్ట్ర అధ్యక్ష పదవికి మొదటి నుంచి నాలుగైదు పేర్లు వినిపించినా.. ఆదివారం పార్టీ వర్గాల్లో ఇద్దరి పేర్లపై ప్రధానంగా చర్చ జరిగింది. జాతీయ నాయకత్వం కొద్ది రోజుల క్రితమే తెలంగాణలోని ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, రాష్ట్ర ముఖ్య నేతల అభిప్రాయాలను తీసుకొన్నట్టు తెలిసింది. సంఘ్ నేతలు, పార్టీలో ఆది నుంచి ఉన్న సీనియర్ నేతలు పలువురు రామచందర్‌రావు పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. మరోవైపు ఈటల పేరు చాలా కాలంగా పరిశీలనలో ఉంది. బీసీ వర్గానికి అధ్యక్ష పదవిలో పార్టీ ప్రాధాన్యం ఇస్తుందన్న చర్చ నేపథ్యంలో అధిష్ఠానం బాధ్యతలు తనకే అప్పగిస్తుందని ఈటల గట్టి ధీమాతోనే ఉన్నారు. వీరిలో ఎవరి పేరును నాయకత్వం ప్రకటిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. భాజపా రాష్ట్ర అధ్యక్షుడి పేరు ప్రకటించాక పార్టీ శ్రేణులు సంబరాలు ఘనంగా చేయాలని పార్టీ నిర్ణయించింది. ఎన్నిక నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా మన్నెగూడలోని ఒక ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి పార్టీ శ్రేణులు సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర భాజపా ఇంఛార్జ్ అభయ్‌పాటిల్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జులై 1న ఎల్బీనగర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడి పేరును పార్టీ అధికారికంగా ప్రకటించనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# రేవంత్‌పై ఎందుకు విచారణకు ఆదేశించడం లేదు

### అమిత్‌షాకు కేటీఆర్ ప్రశ్న



**హైదరాబాద్, జూన్ 29 :** దిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు తెలంగాణలోని రేవంత్ సర్కార్ ఏటీఎంగా మారిందని నిజామాబాద్ గడ్డపై తేల్చి చెప్పిన మీరు దీనిపై ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. సీబీఐ, ఈడీతో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిపై విచారణ జరిపించడానికి ఏం అడ్డు వస్తుందో తెలంగాణ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కేటీఆర్ ప్రకటన విడుదల చేశారు. 'దిల్లీలో కాంగ్రెస్ తో కుస్తీ, రాష్ట్రంలో దోస్తీ అన్నట్లు భాజపా కుమ్మక్కు రాజకీయాలు చేస్తోంది. దీని వల్లే రేవంత్‌ను భాజపా వెనకేసుకొస్తోందనే ఆరోపణలకు అమిత్ షా వద్ద సమాధానం ఉందా? రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి కలిసి ఆర్‌ఆర్ ట్యాక్స్ పేరిట దోచుకుంటున్నారని ఏకంగా ప్రధాని మోదీ రాష్ట్రానికి వచ్చిన సందర్భంలో అన్నారు. దర్యాప్తునకు మాత్రం ఆదేశించడం లేదు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డుకు నయా పైసా కేటాయించలేదు. పేరుకు పసుపు బోర్డు పెట్టి రిబ్బన్ కట్ చేస్తే ప్రయోజనమేంటి?' అని అమిత్‌షాను కేటీఆర్ ప్రశ్నించారు.

# పేద ఖైదీల బెయిల్‌కు ఆర్థికసాయం

### ముందుకొచ్చిన కేంద్ర హోంశాఖ

**హైదరాబాద్:** ఏదైనా నేరం జరిగినప్పుడు పోలీసులు కేసు నమోదుచేసి నిందితులను అరెస్టు చేస్తారు.. అనంతరం కొంత కాలానికి న్యాయస్థానం బెయిల్ మంజూరుచేస్తూ కొన్ని సందర్భాల్లో నిర్ణీత మొత్తం చెల్లించాలని పేర్కొంటుంది. చెల్లించిన తర్వాతే బెయిల్‌పై బయటకు వచ్చేందుకు అర్హత లభిస్తుంది. చాలామంది పేదఖైదీలు ఈ డబ్బు చెల్లించలేక బెయిల్ మంజూరైనప్పటికీ జైళ్లలోనే ఉండాల్సి వస్తోంది. ఇలాంటివారికి 'పేద ఖైదీలకు మద్దతు' పథకం కింద సాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అన్ని రాష్ట్రాల హోంశాఖ ముఖ్యకార్యదర్శులకు, జైళ్లశాఖ డీజీలకు ఇటీవల లేఖ రాసింది. ఈ పథకం కింద అర్హులైనవారి జాబితాను రూపొందిస్తే వారు చెల్లించాల్సిన జరిమానాను కేంద్ర హోంశాఖ చెల్లిస్తుంది. రిమాండ్‌తో పాటు శిక్షపడిన ఖైదీలకూ ఇది వర్తిస్తుంది. ఇందుకోసం కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలు జారీచేసింది. జిల్లా, రాష్ట్రస్థాయిలో కమిటీలు నియమించాలి. రిమాండ్ ఖైదీలైనా.. శిక్షపడినవారైనా బెయిల్ పొందిన 7 రోజుల తర్వాత కూడా విడుదల కాకపోతే అలాంటివారితో ఒక జాబితాను రూపొందిస్తారు. జరిమానా చెల్లించే స్తోమతలేనివారిని గుర్తిస్తారు. రిమాండ్ ఖైదీల జరిమానా మొత్తం రూ.40వేలలోపు ఉంటే అంత మొత్తం విడుదల చేయాలంటూ ఈ పథకానికి 'సెంట్రల్ నోడల్ ఏజెన్సీ(సీఎన్‌ఏ)'గా ఉన్న జాతీయ నేరాల నమోదు సంస్థ(ఎన్‌సీఆర్‌బీ)ని జిల్లా కమిటీ కోరుతుంది. సీఎన్‌ఏ అంత మొత్తం విడుదల చేస్తుంది. ఒకవేళ జరిమానా మొత్తం రూ.40 వేలకు మించి ఉంటే ఆ విషయాన్ని జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీకి తెలియజేస్తుంది. రాష్ట్ర కమిటీ పరిశీలించి సీఎన్‌ఏకు రాస్తుంది. అప్పుడు ఆ మొత్తాన్ని సీఎన్‌ఏ విడుదల చేస్తుంది. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఈ పథకం కింద అర్హులైన ఖైదీల జాబితాను రాష్ట్రంలో సిద్ధం చేస్తున్నారు. అవినీతి నిరోధక, మాదకద్రవ్యాల నిరోధక, మనీ ల్యాండరింగ్, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టాల కింద అరెస్టయినవారికి ఈ పథకం వర్తించదు.

# ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేసేది సిట్టా.. కాంగ్రెస్సా?

### ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్‌పై విచారణను సిట్ అధికారులు చేస్తున్నారా? లేక గాంధీభవన్‌లో ఉన్న కాంగ్రెస్ నాయకులా? అని భారాస నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'భారాస ప్రజలను నమ్ముకొని మాత్రమే అధికారంలోకి వచ్చింది. ట్యాపింగ్‌ను, ఇంటెలిజెన్స్ నివేదికలను నమ్ముకొని కాదు. కాంగ్రెస్ పాలనలోనే ఫోన్ ట్యాపింగ్ ప్రారంభమైంది. 2001లో మా పార్టీ ఏర్పాటైనప్పటినుంచే మా నేతల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారు. ఉద్యమ సమయంలో నాటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ అప్పటి డీజీపీకి ఫిర్యాదు చేసిన విషయాన్ని మర్చిపోవద్దు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే ట్యాపింగ్ పేరుతో ప్రతీకార కుట్రలు చేస్తున్నారు' అని ఆరోపించారు.




# 'ఉచిత ల్యాప్‌టాప్' పేరిట వల

## - కేంద్రం హెచ్చరిక

**న్యూఢిల్లీ :** అమాయకులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. ప్రజలకు ఆశల్ని కల్పించేలా సైబర్ మాయా వలను విసిరి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసేందుకు కొత్త పన్నాగాలు రచిస్తున్నారు. తాజాగా దేశంలో విద్యార్థులందరికీ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందిస్తున్నట్లు పేర్కొంటూ వాట్సప్‌లో వారు మెసేజ్‌లు పంపడంపై కేంద్రం అప్రమత్తమైంది. ప్రభుత్వం ఎలాంటి ఉచిత ల్యాప్‌టాప్‌లూ ఇవ్వడంలేదని స్పష్టం చేస్తూ పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. "కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లను అందించడం ద్వారా విద్యలో డిజిటలైజేషన్‌ను ప్రోత్సహిస్తోంది. అందువల్ల మీరు కేంద్ర ప్రభుత్వ ఉచిత ల్యాప్‌టాప్ పథకం కింద ఉచిత ల్యాప్‌టాప్ పొందాలనుకుంటే.. అధికారిక సైట్‌ను సందర్శించి మీ అర్హతను చెక్ చేసుకోచ్చు" అని పేర్కొంటూ సైబర్ కేటుగాళ్లు పంపిన మెసేజ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్రం కోరింది. ఈ సందేశం నకిలీది, పూర్తిగా మోసపూరితమైనదని ప్రకటించింది. ఇలాంటి అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయొద్దని కోరింది. ఎప్పుడైనా అధికారిక వర్గాల ద్వారా సమాచారాన్ని వెరిఫై చేసుకోవాలని కేంద్రం సూచించింది.

# ఇలాంటి 'పగటి దోపిడీ'ని సహించం

## ఆటోల్లో అధిక ఛార్జీల వసూళ్లపై కర్ణాటక మంత్రి ఫైర్

**బెంగళూరు:** ఆటో అగ్రిగేటర్లు ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేయడంపై కర్ణాటక రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి మండిపడ్డారు. కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ఛార్జీలు వసూలు చేసే యాప్ ఆధారిత, బెంగళూరులోని



ఇతర ఆటోరిక్షాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ తరహా వసూళ్లను 'పగటి దోపిడీ'గా అభివర్ణించిన ఆయన.. నిబంధనలను ఉల్లంఘించిన వారి ఆటోల అనుమతులను రద్దు చేసి.. కేసులు నమోదు చేయాలన్నారు. "ప్రభు త్వం నిర్ణయించిన ఛార్జీల కన్నా అధికంగా వసూలు చేయడం, అడిగినంత చెల్లించకపోతే ట్రిప్పులను రద్దు చేయడం వంటి వాటిపై ప్రయాణీకుల నుంచి ఫిర్యాదు వస్తే.. వెంటనే చర్యలు తీసుకోవాలి. అలాంటి ఆటోల అనుమతులను రద్దు చేసి కేసులు నమోదు చేయాలి" అని కమిషనర్‌కు రాసిన లేఖలో ఆదేశాలు జారీ చేశారు. ఈ తరహా ఉల్లంఘనలపై ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్న ఆయన ఓ ఉదాహరణను లేఖలో ప్రస్తావించారు. 'జూన్ 18న రాపిడో యాప్ కి.మీ.కు రూ.100.89 వసూలు చేసింది. అదే యాప్ 4 కి.మీ.ల ప్రయాణానికి రూ.184.19 వసూలు చేసింది. ఈ తరహా 'పగటి పూట దోపిడీ' క్షమించరానిది. తక్షణమే కఠిన చర్యలు అవసరం" అన్నారు. ఆటో ప్రయాణానికి సంబంధించి మీటర్ ఛార్జీ తొలుత 1.9 కి.మీలకు రూ.30గా, ఆ తర్వాత ప్రతి కి.మీకు అదనంగా రూ.15 చొప్పున నిర్ణయించారు. అయితే, అధిక ఛార్జీలు ఇవ్వకపోతే ట్రిప్పులను తిరస్కరించడం వంటి ఉల్లంఘనలపై రవాణాశాఖ ఇప్పటికే ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసినప్పటికీ.. ప్రజల నుంచి ఈ అంశంపై ఫిర్యాదులు వస్తున్నట్లు మంత్రి గుర్తించారు. ఈ నేపథ్యంలో అధిక ఛార్జీలు వసూలు చేసిన సందర్భాలను హైలైట్ చేస్తూ.. ప్రజలు షేర్ చేసిన మొబైల్ ఫోన్ స్క్రీన్‌షాట్‌లను కూడా ఆయన తన లేఖకు జత చేశారు. ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు సమర్థమం తమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కోరారు. ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడే ఆటో డ్రైవర్లు/యజమానులపై కఠిన చర్యలు తీసుకో వాలని మంత్రి ఆదేశించారు.



# ఎయిరిండియా దుర్ఘటనలో కుట్రకోణంపైనా దర్యాప్తు : కేంద్రం

**న్యూఢిల్లీ :** ఎయిరిండియా విమానం ఏఐ 171 దుర్ఘటన కేసులో కుట్ర కోణంపై కూడా దృష్టిపెట్టినట్లు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ వెల్లడించారు. ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఈ కేసు దర్యాప్తు చేస్తోందని చెప్పారు. పుణెలో జరుగుతున్న ఓ కాన్‌క్లేవ్‌లో ఆయన మాట్లాడారు. రికవరీ చేసిన బ్లాక్‌బాక్స్ ఏఏఐబీ ఆధీనంలో ఉందని.. విశ్లేషణ కోసం దానిని విదేశాలకు పంపబోమన్నారు. "అదో విషాద ఘటన. ఏఏఐబీ పూర్తి స్థాయి దర్యాప్తు ప్రారంభించింది. అన్ని కోణాలను పరిశీలిస్తున్నారు. కుట్ర ఏదైనా ఉందా..? అనే అంశంపై కూడా దృష్టిపెట్టారు. సీసీటీవీ దృశ్యాలను విశ్లేషిస్తున్నారు. చాలా ఏజెన్సీలు దీనిలో పనిచేస్తున్నాయి. రెండు ఇంజిన్లు ఒకేసారి విఫలం అవ్వడం అనేది గతంలో ఎన్నడూ జరగలేదు. ఇది అరుదైన కేసు. దర్యాప్తు నివేదిక వస్తే గానీ.. రెండు ఇంజిన్లు విఫలం అయ్యాయా..? లేక ఇంధన సరఫరాలో సమస్య ఉందా .. అనేది తేలుతుంది. బ్లాక్ బాక్స్‌లోని కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో పైలట్ల సంభాషణ నిక్షిప్తమై ఉంది. నివేదిక మూడు నెలల్లో వస్తుంది. ఇప్పుడే దానిపై మాట్లాడటం తొందర పాటు అవుతుంది" అని మురళీధర్ చెప్పారు. విశ్లేషణ కోసం బ్లాక్ బాక్స్‌ను విదేశాలకు పంపనున్నారనే ప్రచారాన్ని మురళీధర్ కొట్టిపారేశారు. అది ఎక్కడికీ పోదని.. దర్యాప్తు సంస్థల కస్టడీలో ఉందని చెప్పారు. దేశంలో వాడుతున్న 33 డ్రీమ్‌లైనర్ విమానాలను డీజీసీఏ ఆదేశాల మేరకు క్షుణ్ణంగా తనిఖీలు చేశారన్నారు. ప్రజలు ఇప్పుడు భయపడటం లేదని, వారు సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారని చెప్పారు. డీజీసీఏ 419 సాంకేతిక సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడంపై పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ప్రైవేటు విమానయాన సంస్థలు సొంతగా ఎవర్నీ నియమించుకోకూడదని.. డీజీసీఏ అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఆయా సంస్థలు సుదీర్ఘ సమయం పనిచేయాలని పైలట్లపై ఒత్తిడి చేసి వేధిస్తే.. డీజీసీఏను సంప్రదించాలని సూచించారు.

# పాక్‌కు భారంగా భారత బ్యాన్

**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్‌కు సరుకులు తీసుకెళుతున్న లేదా అక్కడి నుంచి సరకులు తరలిస్తున్న నౌకలు భారత్ ఓడరేవుల్లోకి రావడంపై విధించిన నిషేధం ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం ఇస్లామాబాద్ షిప్పింగ్ కోసం అధిక మొత్తంలో చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని అక్కడి పత్రిక డాన్ కథనంలో పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతి చర్యగా మే 2వ తేదీన ఈ బ్యాన్‌ను భారత్ అమల్లోకి తెచ్చింది. భారత్ పోర్టుల నుంచి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాక్ సరుకులు రవాణ కాకుండా ఈ చర్యను చేపట్టింది. దీనిని అమలుపై కూడా దృష్టిపెట్టడంతో పాకిస్థాన్‌పై పెను ప్రభావం చూపిస్తోంది. భారీ నౌకలు పాక్ రేవులకు వెళ్లడానికి ఇష్టపడటంలేదు. దీంతో ఇస్లామాబాద్‌కు దిగుమతులు, ఎగుమతుల్లో కనీసం 30 నుంచి 50 రోజుల వరకు జాప్యం చోటు చేసుకొంటోంది. ఈ విషయాన్ని కరాచీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ జావెద్ బిల్వాని డాన్ పత్రికకు వెల్లడించారు. దీంతో దిగుమతి దారులు ఫీడర్ వెస్సల్స్‌ను నమ్ముకోవాల్సి వస్తోందని చెప్పారు. దీంతోపాటు లాజిస్టిక్స్ ధరలు కూడా గణనీయంగా పెరిగినట్లు చాలా మంది ఎగుమతి దారులు చెబుతున్నారు. కేవలం బీమా ఖర్చులు పెరిగితే అంత ప్రభావం ఉండేది కాదని కానీ, షిప్పింగ్ ధరలు కూడా పెరగడం ఇబ్బంది పెడుతోందని ఆమిర్ అజీజ్ అనే వస్త్ర ఎగుమతి దారుడు వెల్లడించాడు. పాక్‌లోని పరిశ్రమలు ముడిపదార్థాల దిగుమతి కష్టాలు మరింత పెరిగాయి. ఇప్పటికే చాలా పరిశ్రమల దిగుమతులను అక్కడి ప్రభుత్వం నియంత్రిస్తోంది. విదేశీ




మారకద్రవ్యం కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకొంది. తాజాగా భారత్ నిర్ణయం పంపిణీ వ్యవస్థలను మరింత దెబ్బతీసింది. మరోవైపు భారత ప్రభుత్వం పాక్ వస్తువులు దేశంలోకి రాకుండా పలు ఆపరేషన్లు చేపట్టింది. కొన్నాళ్ల క్రితం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ చేపట్టిన 'ఆపరేషన్ డీప్ మానిఫెస్ట్' కూడా దీనిలోని భాగమే. యూఏఈ వంటి దేశాల నుంచి భారత్‌లోకి వచ్చే పాక్ సరుకులను కట్టడి చేసింది. 39 కంటైనర్లలోని దాదాపు రూ. 9 కోట్ల విలువైన 1,100 మెట్రిక్ టన్నుల సరుకులను సీజ్ చేశారు. ఇవి యూఏఈలో తయారైనట్లు తప్పుడు రికార్డులు సృష్టించి దేశంలోకి తీసుకొచ్చారు.

# భారత్‌పై మళ్లీ నోరు పారేసుకున్న మునీర్

**కరాచీ :** భారత్ అకారణంగా రెండు సార్లు పాకిస్థాన్‌పై దాడికి పాల్పడిందని ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిం మునీర్ నోరుపారేసుకున్నారు. న్యూదిల్లీకి వ్యూహాత్మక ముందుచూపు కొరవడిందన్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందన్నారు. మరోసారి తమపై దాడికి పాల్పడితే నిర్ణయాత్మకంగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. కరాచీలోని నేవల్ అకాడమీలో శని వారం జరిగిన కార్యక్రమంలో మునీర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రాంతీయ స్థిరత్వాన్ని పాకిస్థాన్ కాపడుతోందని పేర్కొన్నారు. భారత్ దుందుడుకు తనానికి పాక్ బలంగా స్పందించిందన్నారు. తమ దేశం ప్రాంతీయ శాంతిని దృష్టిలో పెట్టుకొని పరిపక్వంగా స్పందించిందన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేసే స్థితిలో ఉంటే.. భారత్ ఉద్రిక్త తలు సృష్టి స్తోందని వింత వ్యాఖ్యలు చేశారు. అంతకు ముం దు కూడా మునీర్ ఇటువంటి వ్యాఖ్యలే చేశారు.



శుక్రవారం ఆర్మీ ఆఫీసర్స్ కామన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో మాట్లాడుతూ భారత్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందని విచిత్ర వ్యాఖ్యలు చేశారు. న్యూదిల్లీ నెట్‌వర్క్‌కు అఫ్గానిస్థాన్ వేదికగా మారిందన్నారు. అక్కడి వారితో పాకిస్థాన్‌లో దాడులకు పాల్ప డుతోందన్నారు. 'అఫ్గానిస్థాన్‌తో పాక్ స్నేహ సంబంధాలను కోరుకుంటోంది. కానీ, ఆ దేశం భారత్ పోషిస్తున్న ఉగ్రవాదులకు వేదిక ఇవ్వకూడదని కోరుకుంటున్నామన్నారు. వాస్తవానికి పహల్గాం ఉగ్రదాడికి ముందు కశ్మీర్ పాక్‌కు జీవనాడి అంటూ మునీర్ వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాతే బైసరన్ వ్యాలీలో ఉగ్రమూక పర్యాటకుల ప్రాణలను తీసింది. ఈ ఘటన ఇరు దేశాల మధ్య ఘర్షణకు దారి తీసింది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ దెబ్బకు దాదాపు 8 కీలక మిలిటరీ స్థావరాలు దెబ్బతిన్నాయి. వీటిల్లో పాక్ సైనిక ప్రధాన కార్యాలయానికి సమీపంలోని నూర్ ఖాన్ ఎయిర్‌బేస్ కూడా ఉంది.

# అమెరికాలో భారత యువతి 'మిస్సింగ్'..

**యూఎస్ :** అమెరికాకు వెళ్లిన ఓ భారత యువతి (24) అదృశ్యమైంది. పెద్దలు కుదిర్చిన పెళ్లి కోసం ఆమె అక్కడకు వెళ్లినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే కనిపించకుండాపోయింది. ఫిర్యాదు అందుకున్న న్యూజెర్సీ పోలీసులు ఆమె కోసం గాలింపు మొదలుపెట్టారు. సిమ్రన్ అనే యువతి జూన్ 20న భారత్ నుంచి న్యూజెర్సీకి చేరుకుంది. ఐదు రోజుల తర్వాత కనిపించకుండా పోయింది. దర్యాప్తు మొదలుపెట్టిన అధికారులు పెద్దలు కుదిర్చిన పెళ్లి కోసం ఆమె అమెరికా వచ్చినట్లు ప్రాథమిక నిర్ధరణకు వచ్చారు. ఆమెకు స్థానికంగా బంధువులు లేరని, ఇంగ్లీష్ కూడా రాదని గుర్తించారు. సిమ్రన్ వద్ద ఉన్న ఫోన్ కూడా కేవలం వైఫై ద్వారానే పనిచేస్తుందని.. ఆమె ఆచూకీ



గురించి తెలుసుకునేందుకు భారత్‌లో ఉన్న ఆమె కుటుంబ సభ్యులను ఇంకా సంప్రదించలేకపోయామని వెల్లడించారు. సీసీటీవీ ఫుటేజీ పరిశీలించిన లైడెన్‌వోల్డ్ పోలీసులు.. ఓ చోట ఆమె తన ఫోన్‌ను చూసుకుంటూ ఎవరికోసమో వేచిచూస్తున్నట్లు గుర్తించారు. ఆమెకు పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదని, కేవలం అమెరికాకు ఉచితంగా వచ్చేందుకే దీనిని సాకుగా చూపిందనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# ఇజ్రాయెల్‌పై అనుమానం..

# బదులిచ్చేందుకు సిద్ధం : ఇరాన్

**టెహ్రాన్:** కాల్పుల విరమణ ఒప్పందం పాటించడంలో ఇజ్రాయెల్ నిబద్ధతపై పలు అనుమానాలు ఉన్నట్లు ఇరాన్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అబ్దుల్ రహీం మౌసావి తెలిపారు. ఒకవేళ శత్రుదేశం ఒప్పందాన్ని ఉల్లంఘించి మరోసారి దాడులు చేసినా.. బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. సౌదీ అరేబియా రక్షణశాఖ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్‌తో ఆదివారం జరిగిన భేటీ సందర్భంగా మౌసావి ఈ వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ షరతులకు ఇజ్రాయెల్ కట్టుబడి ఉంటుందా? లేదా? అన్నదానిపై మాకు చాలా సందేహాలున్నాయి. అందుకే మేం అప్రమత్తంగా ఉన్నాం. ఒకవేళ శత్రుదేశం మరోసారి దాడులు చేస్తే.. ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించం. కచ్చితంగా బదులిస్తాం" అని మౌసావి అన్నారు. ఇరాన్ ఇప్పటి వరకు యుద్ధం ప్రారంభించలేదని, కేవలం ఇజ్రాయెల్ దాడులకు పూర్తి స్థాయిలో ప్రతిస్పందించిందని తెలిపారు. ఈ మేరకు ఇరాన్ అధికారిక మీడియా సంస్థ తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య



కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన 6 రోజుల తర్వాత ఇరాన్ టాప్ మిలిటరీ కమాండర్ ఈ విధంగా స్పందించడం గమనార్హం. ఇరాన్‌లోని అణుస్థావరాలే లక్ష్యంగా జూన్ 13 నుంచి ఇజ్రాయెల్ గగనతల దాడులకు దిగిన సంగతి తెలిసిందే. అక్కడికి 12 రోజుల తర్వాత అమెరికా మధ్యవర్తిత్వంతో ఆ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయినప్పటికీ, రెండు దేశాలూ గుంభనంగా వ్యవహరిస్తున్నాయి. శత్రుదేశం కదలికలపై దృష్టి పెట్టాయి. ప్రతిదాడులు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

# వెయిటింగ్ లిస్ట్ కుదింపుపై రైల్వేలో పెదవి విరుపు

**దిల్లీ:** రైళ్లలో ప్రయాణికుల వెయిటింగు లిస్టులను 25 శాతానికి పరిమితం చేసిన నిర్ణయాన్ని పలువురు విమర్శిస్తున్నారు. ఈ నిర్ణయం ఆర్థికంగా లాభదాయకం కాదని, ప్రయాణికులకు అసౌకర్యంగా ఉంటుందని పెదవి విరుస్తున్నారు. ఈ నెల 16 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధన ఆచరణాత్మకంగా లేదని రైల్వే రిజర్వేషన్ విభాగాధికారులు సైతం చెబుతున్నారు. "వెయిటింగ్ లిస్టు ఎంతుందో తెలిస్తే డిమాండుపై స్పష్టత వస్తుంది. దాని ఆధారంగా ప్రత్యేక రైళ్లను నడపడంపై నిర్ణయం తీసుకోవచ్చు. పరిమితి విధించాక ఇక డిమాండ్ ఎలా తెలుస్తుంది?" అని రైల్వే వాణిజ్య విభాగ విశ్రాంత అధికారి ఒకరు ప్రశ్నించారు. డిమాండును తక్కువచేసి చూపే బదులు రద్దీ మార్గాల్లో ఎక్కువ రైళ్లు నడపడమే పరిష్కారమని సూచించారు. కొత్త విధానం వల్ల కొన్నిసార్లు రైళ్లలో బెర్తులు ఖాళీగా మిగిలిపోయి, ఆదాయం కోల్పోయే పరిస్థితి రావచ్చని రిజర్వేషన్ సూపర్వైజర్లు అభిప్రాయపడుతున్నారు. రైలు బయల్దేరడానికి ముందున్న వాస్తవ పరిస్థితిని ఏజెంట్లు తెలుసుకుని కరెంట్ రిజర్వేషన్ కేంద్రాల ద్వారా సొమ్ము చేసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.



## ఇలా చేయడం సబబే : రైల్వేబోర్డు

"సమగ్ర అధ్యయనం తర్వాతే 25% పరిమితిని తీసుకువచ్చాం. విపరీతంగా వెయిటింగ్‌లిస్టు టికెట్లు జారీ చేయడం వల్ల రైళ్లలో రద్దీ పెరిగిపోతోందని, టికెట్ల రద్దు రుసుముల రూపంలో రైల్వే సొమ్ము చేసుకుంటోందని విమర్శలు వెల్లువెత్తాయి. మాకు ఆదాయం కంటే ప్రయాణికుల సదుపాయం ముఖ్యం. అన్నీ ఆలోచించే పరిమితి విధించాం" అని రైల్వేబోర్డు కార్యనిర్వాహక సంచాలకుడు దిలీప్ కుమార్ పేర్కొన్నారు.

# ట్రకోమా రహిత దేశంగా భారత్

## ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ ట్రకోమా రహిత దేశంగా భారత్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందని ప్రధాని మోదీ వెల్లడించారు. ఇందు కోసం కృషి చేసిన అందరికీ అభినందనలు తెలిపారు. మోదీ 123వ మన్‌కీ బాత్ ఎపిసోడ్ నేడు ప్రసారమైంది. మిల్లెట్ బిస్కెట్లు తయారు చేస్తున్న తెలంగాణలోని భద్రాచలం ప్రాంత మహిళలను అభినందించారు. జూన్ 21న జరిగిన యోగాడే కార్యక్రమాల్లో దేశ, ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది పాల్గొన్నార న్నారు. దాదాపు 10 ఏళ్ల క్రితం మొదలైన ఈ కార్యక్రమం ఏటేట మరింత విస్తరిస్తోందన్నారు. చాలా



మంది ప్రజలు యోగాను తమ జీవితంలో భాగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన వారు రాజ్యాం గాన్ని హత్య చేయడంతోపాటు.. న్యాయ విభాగాన్ని బానిసగా మార్చుకోవాలను కున్నారని మోదీ తెలిపారు. నాడు జార్జిఫెర్నాండెజ్‌ను సంకెళ్లతో బంధించారన్నా రు. కానీ, భారత ప్రజలు శక్తిమంతమైన వారు కావడంతో.. ఎమర్జెన్సీ తొలగిపోయిందని చెప్పారు. దానిని విధించినవారు ఓడిపోయారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, బాబూ జగ్జీవన్ రామ్ వంటి నేతల ప్రసంగాలను మోదీ వినిపించారు. ఎమర్జెన్సీపై పోరాడిన వారిని కచ్చితంగా గుర్తుపెట్టుకోవాలన్నారు. ఫుట్‌బాల్ ఆటగాళ్లకు కేంద్రంగా బోడోల్యాండ్ మారిందని అభినందించారు. పరిమిత వనరులతోనే సాధన చేసి అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. దేశంలోని చిన్నారులకు వీరు ఆదర్శంగా మారారని కొనియాడారు. ఫిట్‌నెస్, ఊబకాయం తగ్గించుకోవడానికి ఆహారం లో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాని సూచించారు. మేఘాలయ ఎరీసిల్క్‌కు జీఐ ట్యాగ్ లభించిందని అభినందించారు. పురుగులను చంపకుండా వస్త్రాన్ని తయారు చేయడం దీని ప్రత్యేకతన్నారు. ఇక తెలంగాణ భద్రాచలంలోని ఆదివాసి మహిళలు 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరిట బిస్కెట్లు తయారు చేస్తున్నారని.. అవి హైదరాబాద్ నుంచి లండన్‌కు కూడా ఎగుమతి అవుతున్నాయని వెల్లడించారు. ఈ మహిళలే మూడు నెలల్లో 40,000 శానిటరీ నాప్కిన్లను తయారు చేసి విక్రయించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలో బౌద్ధక్షేత్రాలకు విదేశాల్లో అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. అందరూ తమ ప్రాంతాల్లోని బౌద్ధ క్షేత్రాలను ఒక్కసారైనా సందర్శించాలన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న శుభాంశు శుక్లాకు అభినందనలు తెలిపారు.

# అత్యాచారం ఘటనను మీడియాలో చూసే తెలుసుకున్నాం

## : లా కాలేజీ వైస్ ప్రిన్సిపల్

**కోల్‌కతా :** కోల్‌కతాలోని ఓ న్యాయ కళాశాల విద్యార్థిని(24)పై పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్లు విద్యాసంస్థ ప్రాంగణంలోనే దారుణానికి ఒడిగట్టిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై తాజాగా న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపల్




నయన ఛటర్జీ స్పందించారు. ఈ దారుణం జరిగినట్లు అసలు తమ దృష్టికే రాలేదని.. మీడియాలో వార్తలు చూసే తాము విషయం తెలుసుకున్నామని చెప్పడం గమనార్హం. అత్యాచారం జరిగినట్లు బాధితురాలు ఫిర్యాదు ఇచ్చిన మరునాడు పోలీసులు కళాశాలకు వచ్చారని.. అయితే, ఈ విషయం గురించి తమకు సమాచారం ఇవ్వలేదని వైస్ ప్రిన్సిపల్ పేర్కొన్నారు. తాము వచ్చిన విషయం సెక్యూరిటీ గార్డుకు కూడా చెప్పవద్దని పోలీసులు తనను కోరినట్లు చెప్పారు. అనంతరం గ్రౌండ్ ఫ్లోర్‌లోని రెండు గదులను పోలీసులు సీజ్ చేశారని వైస్ ప్రిన్సిపల్ అన్నారు. బాధిత విద్యార్థిని కూడా ఈ విషయంపై కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేయలేదని తెలిపారు. అత్యాచార కేసులో ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా తమ పూర్వ విద్యార్థి అని.. కళాశాలలో బోధనా సిబ్బంది తక్కువగా ఉండడంతో కొన్ని నెలల క్రితం అతడిని తాత్కాలిక అధ్యాపకుడిగా నియమించినట్లు చెప్పారు. ఆమె వ్యాఖ్యలపై ప్రతిపక్ష భాజపా నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలేజీలో ఇంత పెద్ద దారుణ ఘటన జరిగినా.. అందులోని ఉన్నత స్థాయి అధికారులకే తెలియలేదంటే అక్కడి విద్యార్థుల గురించి వారు ఏం పట్టించుకుంటున్నారని మండిపడ్డారు. దర్యాప్తు వేగవంతం చేసి.. నిందితులకు వెంటనే కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని ఓ న్యాయ కళాశాల విద్యార్థిని(24)పై పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్లు కళాశాల ప్రాంగణంలో అత్యాచారానికి పాల్పడిన ఘటన జూన్ 25న చోటుచేసుకుంది. విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగినట్టు వైద్యపరీక్షల్లో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా(31) సహా కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో నిందితులకు సెక్యూరిటీ గార్డు సహకరించినట్లు అనుమానించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

# కోల్‌కతా అత్యాచార ఘటన..

## సొంత పార్టీ నేతలపై మహువా ఆగ్రహం

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో న్యాయ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ క్రమంలో బాధితురాలిదే తప్పంటూ అధికారిక టీఎంసీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలపై ఆ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా స్పందిస్తూ సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. భారత్‌లోని అన్ని పార్టీల్లో స్త్రీ ద్వేషులు ఉన్నారని రాసుకొచ్చారు. అలాంటి అసహ్యకరమైన వ్యాఖ్యలు ఎవరు చేసినా తమ పార్టీ ఖండిస్తుందంటూ పేర్కొన్నారు. ఇక, మరో పోస్టులో విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోందన్నారు. ఫిర్యాదు చేసిన 12 గంటల్లోపే పోలీసులు నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. మహిళలపై జరిగే నేరాలను టీఎంసీ నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఏ మాత్రం సహించదన్నారు. ఈ సందర్భంగా భాజపాపై కూడా విమర్శలు చేశారు. ఈ అత్యాచార ఘటనపై టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, ఎమ్మెల్యే మదన్ మిత్రా మాట్లాడుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. విద్యార్థినిపై ఆమె స్నేహితులు అత్యాచారం చేస్తే ఎవరేం చేస్తారని, పోలీసులు కళాశాలల్లో ఉంటారా అని కల్యాణ్ అనగా.. ఆ విద్యార్థిని ఒంటరిగా కాలేజీకి వెళ్లకపోతే ఇలాంటి ఘటన జరిగి ఉండేది కాదని మిత్రా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపడంతో పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమైనవని.. పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. జూన్ 25న ఈ అత్యాచార ఘటన చోటుచేసుకుంది. కోల్‌కతాలోని ఓ న్యాయ కళాశాల విద్యార్థిని(24)పై పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్లు విద్యాసంస్థ ప్రాంగణంలోనే అత్యాచారానికి ఒడిగట్టారు. విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగినట్టు వైద్యపరీక్షల్లో రూఢీ అయిందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా(31)కు టీఎంసీ నేతలతో సన్నిహిత సంబంధాలున్నట్లు తెలుస్తోంది.



అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## బునాదిగాని కాల్వను పూర్తి చేసి ఖరీఫ్ పంటకు సాగునీరు అందించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** బునాదిగాని కాల్వను యుద్ధ ప్రతిపాదికాన పూర్తి చేసి ఈ ఖరీఫ్ పంటకు సాగునీరు అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం రోజున భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వలిగొండ మండల 14వ మహాసభ నర్సాపురం గ్రామంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్లో ఎలగందుల అంజయ్య అధ్యక్షతన జరిగింది. ముందుగా మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ఆవిష్కరించారు. ఈ మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గీత పనివారాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ బొమ్మగాని ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని, అన్యాయం, దోపిడీ, అణచివేతలున్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన ఉంటుందని అన్నారు.సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ అరులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్ లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో సిపిఐకు ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన అన్నారు.ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి బోలగాని సత్యనారాయణ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, బండి జంగమ్మ, ఎండీ ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్క దయాకర్ రెడ్డి, మరుపాక వెంకటేష్, సలిగంజి వీరస్వామి, ఎల్లంకి మహేష్ నాయకులు బాలగోని సత్యనారాయణ, పులిపల్పుల మల్లేశం, సల్వాద్రి రవీందర్, బోడిగే సుదర్శన్, అంబటి అంజయ్య, మారోజు నరసింహ చారి, సుద్దాల సాయికుమార్, నార్కెట్పల్లి మచ్చగిరి, కట్ల యాదగిరి, మేడి దేవేందర్, పోశబోయిన బొందయ్య, చేగురి పాపయ్య, సాలిగంజి కృష్ణ కుమార్, బోడ సునీత, రేణుక, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

#### మహాసభలో చర్చించిన తీర్మానాలు

ఈ మహాసభ చర్చించి ఈ కింది తీర్మారాలను ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది. 1. వలిగొండ మండలంలో ఉన్నటువంటి సాగునీటి కాలువలు, భీమలింగం కాలువలను పూర్తి చేసి రైతులకు సాగనిరు అందించాలి 2. భీమలింగం కాల్వను వెల్వర్తి నుండి 5 మీటర్ల వెడల్పుతో చివరి ఆయకట్టు ఆయన దుపెల్లి ఎల్లమ్మ చెరువు వరకు పొడిగించి పూర్తి చేయాలి 3. వలిగొండ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి 4. విద్యుత్ ట్రాన్స్ ఫారం రిపేరు సెంటర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలి , 5. ముసి నది ప్రక్షాళన చేసి వ్యవసాయా రంగానికి స్వచ్ఛమైన నీరు అందించాలి 6. ఉపాధి హామీ కార్మికులకు పెండింగ్లో ఉన్న బాకాయిలను వెంటనే విడుదల చేసి పని దినాలను పెంచాలి 7. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలకు పెంచాలి.

# వానమ్మ.. ఒక్కసారి వచ్చిపోవమ్మా

- వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతన్నలు
- ఎండిపోతున్న నాటిన విత్తనాలు
- కప్పకాముడు ఆటలాడిన కరుణించని వరణుడు

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** ఈసారి రాష్ట్రంలోకి పది రోజులు ముందుగానే వచ్చిన నైరుతి రుతుపవనాలతో వర్షాలు కురుస్తాయని ఆశపడ్డ రైతన్నకు నిరాశనే మిగిలింది ఇలా వచ్చిన వర్షాలు ఊరించి ఉసూరుమనిపించాయి. వరుడు ముఖం చాటేయడంతో ఎండలు దంచి కొడుతున్నాయి. ముందస్తు తొలకరి జల్లులకు విత్తనాలు విత్తుకున్న అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు మొలకెత్తిన విత్తనాలు స్థానంలో మళ్లీని విత్తుకునేందుకు కొందరు సిద్ధమవుతున్నారు.

### గ్రామాలలో కప్పకాముడు ఆడుతున్న మహిళలు

ఇంత అభివృద్ధి చెందిన కాలంలో కూడా తెలంగాణలో పూర్వకాలం నుండి వస్తున్న ఒక సాంప్రదాయం కొనసాగుతుంది వర్షాలు పడని గ్రామాల్లో కప్పను పసుపు పూసి ముడి వేసిన కాడి లో కట్టి మహిళలు ఊరంతా తిరుగుతూ ఇంటింటా నీళ్లు పోస్తూ వరుణ దేవుని కోరుతా రు. అనంతరం ఊరు చివర పాయసం వండి బండమీద పోసి తినే సంప్రదాయం నేడు కూడా అమలులో ఉంది. అలాంటిదే యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోని పులిగిల్ల గ్రామంలో ఆదివారం రోజున మహిళలు కప్పకాముడు ఆట ఆడి ఇంటింటా తిరుగుతూ వర్షాలు కురవాలని వరుణ దేవుని కోరుకున్నారు. ఇకనైనా కరుణించి వర్షాలను కురిపించవయ్యా ఓ వరుణ దేవా..!







## పీజేఆర్ విగ్రహానికి పాలాభిషేకం

**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం హైదరాబాద్ ముద్దు బిడ్డ స్వర్గీయ జననేత పి. జనార్దన్ రెడ్డి పేరు మీద హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో ప్రయాణించే వారికి నూతనంగా నిర్మించిన 6 లేన్ బై డైరెక్షనల్ ఫ్లై ఓవర్ కు పీజేఆర్ పేరు పెట్టినందుకు కృతజ్ఞత తెలియజేస్తూ బాలానగర్ డివిజన్ రాజు కాలనీ వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులి శ్రీకాంత్ పటేల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నియోజవర్గ ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హాజరై పీజేఆర్ విగ్రహానికి, రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ గచ్చిబౌలి ఫ్లైఓవర్ కు స్వర్గీయ జననేత పి. జనార్దన్‌రెడ్డి పేరు నామకరణం చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొండకింది పుష్పారెడ్డి, డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్, కృష్ణ రాజ్ పుత్, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల దేశాల్, సంజీవ్ రావు, ఎ. బ్లాక్ ఉపాధ్యక్షుడు యుగందర్ రెడ్డి, ఆకుల నరేందర్, బందీగా బాలనరసింహ, మదారి శ్రీను, ప్రసన్నకుమార్, రేణుక, సాయి భారతి, రవిముదిరాజ్, సదాగౌడ్, రవిగౌడ్, రామ్మోహన్, శ్రీనివాస్, సోను, శివ, రమణ, రవి, అనిల్, అస్లాం, శేఖర్ గజానంద్, మహిళా నాయకురాళ్లు హాజరయ్యారు.



## రాజ్యాంగం మార్చేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్రలు

- బోడుప్పల్లో 332వ వారం అంబేద్కర్ కు జ్ఞానమాల
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న తోటకూర వజ్రేష్ యాదవ్

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 332వ ఆదివారం జ్ఞానమాల ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, కీసర గుట్ట దేవాలయ డైరెక్టర్ రాపోలు శంకరయ్య, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చింతల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొమ్మక్ రమేష్ తదితరులు పాల్గొని అంబేద్కర్ కు నివాళులర్పించారు. తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగం కోసం అనేక కష్టనష్టాలను భరించి తన జీవితాన్నే త్యాగం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని, ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రభుత్వం మార్చేందుకు చేస్తున్న కుట్రలను ప్రియతమ నాయకుడు రాహుల్ గాంధీ తిప్పి కొడుతున్నారని, రాజ్యాంగం జోలికొస్తే ఏ పార్టీ అయినా ఏ నాయకుడైనా సహించేది లేదని వజ్రేష్ యాదవ్ మండిపడ్డారు. కార్యక్రమంలో గరుగుల యాకయ్య, చిల్ల అంజయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎక్కిరాల లక్ష్మీనరసయ్య, నేదునూరి బ్రహ్మయ్య, వెస్ట్ బాలాజీ హిల్స్ కాలనీవాసులు బట్టు దేవేందర్, నరేందర్, చంద్రశేఖర్, ఆటో యూనియన్ అధ్యక్షుడు చిత్రకుమార్, ఈశ్వర్, జనార్ధన్ పాల్గొన్నారు.



## మహా న్యూస్ కార్యాలయంపై దాడిని ఖండించిన బండి రమేష్

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :** మహా న్యూస్ కార్యాలయంపై టిఆర్ఎస్ గుండాల దాడిని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ఆదివారం మహా న్యూస్ కార్యాలయాన్ని సందర్శించారు. సంస్థ సిఎండి మారెళ్ళ వంశీని కలిసి జరిగిన ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భారతదేశంలోనే ఇలాంటి ఘటన జరగడం మొట్టమొదటిది కావచ్చు అని, ఇది దురదృష్టకరమని అన్నారు. తమపార్టీ తరఫున, ప్రభుత్వం తరఫున ఈ ఘటన ఖండిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దుశ్చర్యలు జరగకుండా దాడికి పాల్పడ్డ దుండగులపై ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. టిఆర్ఎస్ హయాంలో ఇలాంటి అరాచకాలు చాలా జరిగాయన్నారు. దీనికి ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా పిలువబడే మీడియాపై ఈ దాడి ఓ ఉదాహరణ అన్నారు. ఇతర పార్టీల నాయకులతో పాటు సొంత మహిళల ఫోన్లు ట్యాప్ చేయడం కూడా దేశంలో మొట్టమొదటిసారి అని అది టిఆర్ఎస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ప్రశ్నించే గొంతులు నొక్కి నిజాన్ని రూపుమాపాలని చూడడం టిఆర్ఎస్ పార్టీ పెద్దలకు అలవాటేనన్నారు. ఈ దాడి ప్రారంభం మాత్రమేనని భవిష్యత్తులో ఎలాంటి దాడులు మరిన్ని జరుగుతాయని టీఆర్ఎస్ నాయకులు పేర్కొనడం వారి దౌర్జన్యానికి పరాకాష్ట అన్నారు. ఈ దాడిని మీడియా మొత్తం ఖండించాలని రమేష్ సూచించారు.



## ఆర్థిక సహాయాన్ని అందజేసిన వాకిటి అనంతరెడ్డి

**వలిగొండ రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోని అరూరు గ్రామానికి చెందిన బోళ్ల శేఖర్ అనారోగ్య కారణాల మరణించడం జరిగింది. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తు పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంత రెడ్డి అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖా అధ్యక్షులు బుర్ర నరసింహ, మాజీ ఉప సర్పంచ్ సుక్క ముత్యాలు, మచ్చగిరి గుట్ట డైరెక్టర్ కోడితల కరుణాకర్, సెవధల్ ఉపాధ్యక్షుడు కోపుల బాలరాజు,పాల సంఘం డైరెక్టరులు బుర్ర శ్రీ శైలం, రెబస్ సత్తయ్య ,దమెర అంజయ్య, జినుకల మల్లేష్, మర్రి ముత్యాలు,రెబస్ నరసింహ, అర్జున్, దోతీ కిష్టయ్య, మర్రి నాగ రాజు, సిద్ధయ్య, నిమ్మల రామచంద్రు, బోళ్ళ నరసింహ, లింగస్వామి, ఉధేష్, కృష్ణ వేముల ఎటయ్య, కసిరబోయిన మహే ష్, వేంకటేశ్, అంజయ్య,చిలకమరి శ్రీనివాస్ చారి ,రెబస్ నరేష్, ఐలపాక స్వామి, పందిరి సంపత్, ఆకుల మచ్చగిరి, రాజు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య





**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** రజక వృత్తిదారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రజక సంఘం ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య తెలిపారు. ఈ మేరకు ఆదఆదివారం మేడిపల్లి మండలం రజక వృత్తిదారుల సంఘం జనరల్ బాడీ సమావేశం మేడిపల్లిలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలంగాణ రజక దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశ య్య హాజరై మాట్లాడుతూ... మేడిపల్లి మండలంలోని అనేక గ్రామాల లో నేటికి రజకులు వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వృత్తిదారులు పేదరికంలో మగ్గుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రజకులకు మోడరన్ ధోబిఘాట్లో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా బీసీ కార్పొరేష న్ ద్వారా వృత్తిదారులకు రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రజక ఆత్మగౌరవ భవన స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి స్థలాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. రజక ఫెడరేషన్ కు వెంటనే ప్రభుత్వం పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని, ఉచిత విద్యుత్తు పథకం పెండింగ్ బిల్లులు ప్రభుత్వ వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా ఆశయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు చౌడరం సుభద్ర, జిల్లా కార్యదర్శి జ్యోతి ఉపేందర్ జిల్లా సహాయ కార్యదర్శి సట్టు రవి, జ్యోతి దుర్గయ్య జిల్లా ఉపాధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య నూతన మండల కమిటీని ప్రకటించారు.

#### మేడిపల్లి మండల నూతన కార్యవర్గం:

మేడిపల్లి మండల రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షులుగా అంబే చక్రపాణిని నియమించారు. ముఖ్య సలహాదారులుగా కల్మూరి ఎల్లయ్య, కమిటీ ఉపాధ్యక్షులుగా బోడుప్పల్ బిక్షపతి, పర్వతపూర్ మహేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అంబే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గోరుకంటి నరేందర్, ప్రచార కార్యదర్శిగా అంబే కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా గోరుకంటి కృష్ణ, కార్యదర్శి గుండేపూరి నరేష్, మహిళా కన్వీనర్ దానాల భారతి, ధనలక్ష్మి , అండాలు మరో 20 మంది కార్యవర్గ సభ్యులుగా నూతన మండల కమిటీని ఈ సందర్భంగా ప్రకటించడం జరిగింది.



## ఆగస్టు 3వ తేదీన బోడుప్పల్‌లో బోనాల జాతర

- 4వ తేదీ బలిగంప, రంగం కార్యక్రమం
- తేదీని నిర్ణయించిన బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పెద్దలు.

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో గ్రామ పెద్దలందరూ పార్టీలకతీతంగా సమావేశమై బోనాల పండుగను ఆగస్టు 3వ తేదీన అందరూ సమిష్టిగా బోనాల జాతర నిర్వహించడానికి కార్పొరేషన్ పెద్దలందరూ నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ పోగుల నర్సింహా రెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## హమాస్‌తో ఒప్పందం చేసుకోండి : ట్రంప్

**వాషింగ్టన్ :** గాజాలో జరుగుతున్న యుద్ధాన్ని వేగంగా ముగించి.. సంధి కుదర్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్టు పెట్టారు. "గాజాలో ఒప్పందం చేసుకోండి. బందీలను వెనక్కి తీసురండి" అని పేర్కొన్నారు. ఆయన గతంలో ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఆమోదించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై ఒత్తిడి తెచ్చినట్లైంది. గాజాలో వచ్చేవారం సంధి కుదురుతుందని ప్రకటించిన కొన్ని గంటల్లోనే మరోసారి సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం గమనార్హం. నెతన్యాహుపై కేసులను వదిలేయాలని ఇజ్రాయెల్ ప్రాసిక్యూటర్లను అభ్యర్థించిన కొన్ని గంటల్లోనే ఈ పోస్టును పెట్టడం విశేషం. ఇజ్రాయెల్ ప్రధాని ప్రస్తుతం హమాస్‌తో చర్చలు జరుపుతున్నారని.. ఆ ఒప్పందం కుదిరితే బందీలు వెనక్కి వస్తారని ట్రంప్ పేర్కొన్నారు. గత బుధవారం ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ ఇజ్రాయెల్ ప్రధానిపై కేసులు కేవలం వేధింపులు అనే అర్థం వచ్చేట్లు పోస్టు పెట్టారు. ఇరాన్‌పై యుద్ధ సమయంలో అమెరికా అధ్యక్షుడి మద్దతుకు నెతన్యాహు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల కాలంలో ఇజ్రాయెల్‌కు సహాయన్ని కూడా అగ్ర రాజ్యం గణనీయంగా పెంచింది. వాషింగ్టన్ నుంచి ప్రపంచంలో మరే దేశానికి అంత స్థాయిలో ఆర్థిక సాయం అందలేదు. అక్టోబర్ 7వ తేదీ హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసి వందల మందిని హత్య చేసింది. 251 మందిని బందీలుగా పట్టుకుపోయింది. వీరిలో కొందరు ప్రాణాలు కోల్పోగా.. 49 మంద ఇప్పటికీ హమాస్ చెరలోనే ఉన్నట్లు భావిస్తున్నారు.



## ఉక్రెయిన్‌పై అతిపెద్ద గగనతల దాడి..

**ఉక్రెయిన్ :** యుద్ధం మొదలైన నాటి నుంచి అతి పెద్ద గగనతల దాడి ఉక్రెయిన్‌పై శనివారం రాత్రి జరిగింది. రష్యా మొత్తం 537 ఆయుధాలను ప్రయోగించింది. వీటిల్లో 477 డ్రోన్లు, 60 క్షిపణులు ఉన్నాయని ఉక్రెయిన్ వాయుసేన వెల్లడించింది. వీటిల్లో 249ని కూల్చేశామని.. మరో 226 ఎలక్ట్రానిక్ జామింగ్ వ్యవస్థల ప్రభావంతో కూలిపోయాయని తెలిపింది. ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ కమ్యూనికేషన్ కమాండర్ యూరీ ఇహ్‌నాట్ మాట్లాడుతూ.. గత రాత్రి అతిపెద్ద దాడి జరిగిందని వెల్లడించారు. ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని రష్యా ఆయుధాలను ప్రయోగించినట్లు చెప్పారు. పోలాండ్ గగనతల రక్షణ కోసం మిత్రదేశాల యుద్ధ విమానాలు రంగంలోకి దిగినట్లు పేర్కొన్నారు. ఖెర్సాన్ ప్రావిన్స్‌లో జరిగిన దాడుల్లో ఒకరు మరణించినట్లు అక్కడి గవర్నర్ వెల్లడించారు. ఈ దాడిలో ఉక్రెయిన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానం కూలిపోయి.. అందులోని పైలట్ ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి మిలిటరీ తెలిపింది. ఇప్పటి వరకూ ఈ యుద్ధంలో మూడు ఎఫ్-16లను రష్యా కూల్చివేసింది. ఇక ఉక్రెయిన్ తీరప్రాంత నగరమైన ఒడెసాలోని ఓ అపార్ట్‌మెంటుపై రష్యా శుక్రవారం రాత్రి చేసిన డ్రోన్ దాడిలో భార్యాభర్తలు మరణించారు. ఈ దాడిలో 17 మంది తీవ్రంగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. అపార్ట్‌మెంట్‌లోని మూడు అంతస్తులు దెబ్బతిన్నాయి. మరోవైపు పశ్చిమ రష్యా, క్రిమియాపై ఉక్రెయిన్ ప్రయోగించిన 40 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. రష్యాలో వేర్పాటువాదాన్ని పశ్చిమ దేశాలు ప్రోత్సహిస్తున్నాయని, ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధంలో జోక్యం చేసుకుంటున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోపించారు. బెలారస్ రాజధాని మిన్స్క్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. "రష్యాకు వ్యతిరేకంగా ఇస్లామిక్ స్టేట్ పనిచేస్తున్నంత కాలం ఎవరూ దానిపై దృష్టి సారించరు. మాస్కోలో పేలుళ్లు నేటికీ జరుగుతున్నాయి. మా దేశంలో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించి, మాపై పోరాటానికి ఉగ్రవాదాన్ని సాధనంగా ఎంచుకున్న పశ్చిమదేశాల విషయంలో కూడా ఇదే జరిగింది. నాటో విస్తరణ, ఉక్రెయిన్‌తో వివాదాన్ని పరిష్కరించడం లాంటి వాగ్దానాలు ఇచ్చి వాటిని నిలబెట్టుకోకుండా పశ్చిమ దేశాలు రష్యాను పదేపదే మోసం చేస్తున్నాయి" అని పుతిన్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.



# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

### మాజీ మేయర్ అమర్ సింగ్

- 5వ డివిజన్ రాంనగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన
- పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, స్థానిక మాజీ కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణ గౌడ్, పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాలనీ అధ్యక్ష కార్యదర్శులు, ప్రజలు



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పీర్జాదిగూడ నగర మాజీ మేయర్ అమర్ సింగ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నగర పరిధిలోని 5వ డివిజన్ రాంనగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు స్థానిక మాజీ కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పీర్జాదిగూడ నగరంలో అనేక అభివృద్ధి పనులు మొదలయ్యాయని అది కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడిందని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. 5వ డివిజన్ అభివృద్ధిలో అగ్రభాగాన నిలిచిందని స్థానిక మాజీ కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణ గౌడ్ కృషివల్లే కాలనీలన్నీ అభివృద్ధిలో ముందున్నాయని అన్నారు. అదేవిధంగా 5వ డివిజన్ లో సాంక్షన్ అయిన భూగర్భ డ్రైనేజీ పనులు, సిసి రోడ్లు పెండింగ్ లో ఉన్నాయని అవి కూడా అతి త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ

కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి, బొడిగె రాందాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఈశ్వర్ రెడ్డి, యాసారం మహేష్, వంగూరి పరమేష్, కవిడ కుమార్, కె.వి.గౌడ్, కాలనీ అధ్యక్షులు చిలుముల రవిశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె పాండు, కోశాధికారి రమేష్, మాజీ అధ్యక్షులు బద్దం అంజి రెడ్డి, పన్నాల జంగారెడ్డి,మాజీ జనరల్ సెక్రెటరీ గున్నాల అశోక్ రెడ్డి, మర్రి జంగారెడ్డి, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, కోక్కు వెంకటేష్, బల్లెపు నర్సింగ్ రావు, డేగ శీను, బొడిగె భాస్కర్ గౌడ్, శ్రీ చైతన్య స్కూల్ రమేష్, బోడిగే శ్రీనివాస్ గౌడ్, పి.గోపాల్, సిహెచ్.బాలేష్, దీపక్, కే .శ్రీనివాస్, ఎస్. బుచ్చిరెడ్డి , టీ.విజయ్, పి.కుమార్ రెడ్డి, ఆర్.రవి, అంజయ్య చారి, శ్రీనివాస్ చారి, ఎల్లయ్య చారి, టీ.లక్ష్మీనారాయణ, నరేష్, బిఎస్ కేజీ యువసేన జవాన్ అతిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉక్రెయిన్ అమ్ముల పొదిలో 'చీమల దండు'



**ఉక్రెయిన్ :** రష్యాతో అలుపెరుగని యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్ తాజాగా.. మరో అస్త్రాన్ని తన అమ్ముల పొదిలో చేర్చింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన మురాఖా (చీమ) అనే చిన్నపాటి మానవరహిత రోబోను యుద్ధ కార్యకలాపాల్లో వినియోగించేందుకు ఆ దేశ రక్షణశాఖ అనుమతించింది. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సైనికులకు సాయం చేసేందుకు వీటిని వినియోగించనున్నారు. శత్రు సైన్యం కాల్పులు జరిపేటప్పుడు, మందుపాతరలు ఉన్నట్లు అనుమానించిన ప్రాంతాల్లో వీటిని ముందువరుసలో నిలపనున్నారు. పరిమాణంలో చాలా చిన్నదిగా ఉన్నందున దీనికి 'చీమ' రోబో అని పేరుపెట్టారు. ఇది 500 కిలోల వరకు బరువును మోయగలదు. నిర్మాణ ఆకృతి కారణంగా శత్రు జామర్లకు కూడా దొరకదు. రష్యా అనుసరిస్తున్న అత్యాధునిక ఎలక్ట్రానిక్ యుద్ధ రీతులను సమర్థంగా ఎదుర్కొనేందుకు మానవ రహిత గ్రౌండ్ వెహికల్స్ (యూజీవీ)లను అభివృద్ధి చేసేందుకు ఉక్రెయిన్ ఎప్పటి నుంచో ప్రయత్నాలు మొదలుపెట్టింది. రిమోట్ కంట్రోల్ ద్వారా ఆపరేట్ చేస్తూ.. ప్రమాదకర పరిస్థితుల్లోనూ శత్రుసైన్యంతో పోరాడేందుకు ఉక్రెయిన్ వీటిని అభివృద్ధి చేసింది. ఈ రోబోను తొలిసారిగా జనవరి 2024లో ఆవిష్కరించారు. సుమారు 350 కిలోల బరువు ఉంటుంది. ఒకసారి ఛార్జింగ్ పెడితే 15కి.మీ వరకు ప్రయాణించవచ్చు. అవసరం మేరకు ఇందులో ఒకట్రెండు లిథియం బ్యాటరీలను వినియోగిస్తారు. మరోవైపు ఇటీవలే 'డాడ్జర్' అనే మరో యూజీవీ రోబోను కూడా మిలిటరీలో వినియోగించేందుకు ఉక్రెయిన్ అనుమతిచ్చింది. ఇది 250 కిలోల వరకు బరువుల్ని మోయగలదు. మందుగుండు సామగ్రిని, యుద్ధ పరికరాలను కీలక ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా దీని నిర్మాణాన్ని చేపట్టారు. రష్యాతో దీర్ఘకాలంగా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో 2024 నుంచి రోబోటిక్ పరికరాల అభివృద్ధిని ఉక్రెయిన్ వేగవంతం చేసింది. యుద్ధ క్షేత్రంలో ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు వీలుగా రిమోట్ ద్వారా పని చేసే మానవ రహిత గ్రౌండ్ వెహికల్స్‌ని ఉత్పత్తి చేస్తోంది. ఇప్పటికే కృత్రివ-ఎమేధతో పని చేసే డ్రోన్ వ్యవస్థను కూడా వినియోగిస్తోంది. ఇప్పటి వరకు 80కిపైగా రోబోలను యుద్ధరంగంలోకి దించింది. ఈ ఏడాది పూర్తయ్యేనాటికి 15,000 రోబోలను యుద్ధక్షేత్రంలోకి దించుతామని ఉక్రెయిన్ రక్షణశాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది.



## బిగ్ బ్యూటిఫుల్ బిల్లుపై మరోసారి విమర్శలు చేసిన మస్క్..

**యూఎస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య ఇటీవల విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే. ట్రంప్ పాలకవర్గం తీసుకొచ్చిన 'బిగ్ బ్యూటిఫుల్ బిల్'ను మస్క్ తీవ్రంగా వ్యతిరేకించడమే అందుకు కారణం. తాజాగా టెస్లా అధినేత మరోసారి ఈ బిల్లుపై మాట్లాడుతూ.. తీవ్ర విమర్శలు చేశారు. ఈ బిల్లుపై సెనెట్‌లో ఓటింగ్ జరగడానికి కొన్ని గంటల ముందు మస్క్ ఎక్స్‌లో వరుస పోస్టులు చేశారు. ఈ తాజా బిల్లు అమెరికాలోని మిలియన్ల మంది ఉద్యోగాలను నాశనం చేస్తుందని అందులో పేర్కొన్నారు. దేశానికి అపారమైన హాని కలిగిస్తుందన్నారు. ఇది ఒక విధ్వంసకర చర్య అని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో పరిశ్రమలను కూడా తీవ్రంగా దెబ్బతీస్తుందన్నారు. మరో పోస్టులో ఈ బిల్లు రిపబ్లికన్‌ల రాజకీయ ఆత్మహత్యగా పేర్కొంటూ నిర్వహించిన పోల్‌ను కూడా ఆయన ప్రస్తావించారు. ఇది రుణ పరిమితిని 5 ట్రిలియన్ డాలర్లకు పెంచుతుందని తెలిపారు.

### బిల్లుకు సెనెట్‌లో ఆమోదం..

ఇదిలా ఉండగా.. ట్రంప్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు సెనెట్‌లో ఆమోదం పొందింది. తీవ్ర ఉత్కంఠ మధ్య సాగిన ఈ ఓటింగ్‌లో 51-49 తేడాతో బిల్లుకు ఆమోదం లభించింది. ఈక్రమంలో డెమోక్రట్లందరూ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇక సెనెట్‌లో బిల్లుకు ఆమోదం లభించడంపై ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. ఇది గొప్ప విజయమని ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. బిల్లుకు ఆమోదం తెలిపిన రిపబ్లికన్‌లకు ధన్యవాదాలు తెలిపారు, వారు లేకపోతే ఇది సాధ్యం కాదన్నారు. వారు నిజంగా దేశాన్ని ప్రేమించే వ్యక్తులని, అమెరికా అధ్యక్షుడిగా తనకు ఇప్పుడు గర్వంగా ఉందన్నారు. ఇది తమ ఆర్థిక వ్యవస్థను మెరుగు పరిచేందుకు, వృథా ఖర్చులను తగ్గించడానికి, సరిహద్దు భద్రతను పెంచడానికి ఉపకరిస్తుందన్నారు. ఇక, గతంలోనూ మస్క్ ఈ బిల్లును వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అధ్యక్షుడు, టెస్లా అధినేతల మధ్య దూరం పెరిగింది. ఆ సమయంలో పరస్పరం తీవ్ర ఆరోపణలు కూడా చేసుకున్నారు. ఆ తర్వాత ట్రంప్‌పై తాను చేసిన వ్యాఖ్యలకు పశ్చాత్తాపం చెందుతున్నట్లు మస్క్ పోస్టు పెట్టడంతో వివాదం ముగిసింది.



# ఇల్లీగల్ ఎఫైర్

## పచ్చని సంసారాల్లో అక్రమ సంబంధాల చిచ్చు

**మాయమవుతున్నాడమ్మా మనిషన్నవాడు అంటూ ఓ సినీగేయ రచయిత పాడిన పాటను ప్రస్తుత రోజుల్లో జరుగుతున్న వివాహేతర సంబంధాల చిచ్చు.. అనంతరం జరుగుతున్న పరిణామాలకు అన్వయించుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. క్షణకాలం సంతోషం కోసం వెంపర్లాడితే మొత్తం జీవితం నాశనం చేస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న, జరిగిన ఘటనలు ఇందుకు నిదర్శనం.**





**దిగజారుతున్న కుటుంబ విలువలు**

**వివాహేతర సంబంధాల మోజు**

**అక్రమ సంబంధాలతో సొంత వారిని కాటికి పంపుతున్న వైనం**

పచ్చని సంసారాల్లో వివాహేతర సంబంధాలు చిచ్చు రేపుతున్నాయి. దీంతో కన్నవారికి సొంత ఊరికి చెడ్డపేరు తీసుకొచ్చి చివరికి కటకటాల్లోకి చేరి ఊచలు లెక్కపెట్టాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి... టీవీ సీరియల్లు... ఓటీటీలో వచ్చే అడల్ట్ కంటెంట్ ఆలోచనలను పెడదోవ పట్టిస్తున్నాయని అందుకని బీకేర్ ఫుల్ అంటున్నారు మేడ్చల్ పోలీస్ అధికారులు. తమ సంబంధాలకు అడ్డువస్తే సొంతవారైన కనికరం లేకుండా వివాహేతర సంబంధాల మోజులో పడి క్షణికానందం కోసం పరితపించి సొంత మనుషులను సైతం కనికరం లేకుండా కడతేర్చుతున్నారు. తమకు కావాల్సింది దక్కితే సరిపోతుంది అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. సొంత మనుషులైన ఇతరులైన మాకేం పట్టదు అన్నట్లు వ్యవహరించి తమ సంబంధాలకు అడ్డువస్తే అడ్డు తొలగించుకుంటు చేసిన పాపం పండి కటకటాల పాలవుతున్నారు. ఫలితంగా ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంటుంది. ఇక ఆయా ఘటనలో కుటుంబ పెద్ద మరణించిన జైలుకెళ్లిన ఆ కుటుంబం మాత్రం పెద్ద దిక్కు కోల్పోయి రోడ్డు పాలవుతుంది. క్షణీకానందం కోసం వెంపర్లాడేవారు ఒక్కక్షణం ఆలోచించుకోవాలి. వివాహేతర సంబంధాల జోలికి వెళ్లకుండా తమను తాము నియంత్రించుకోవాలి. జాగ్రత్త పడితే తమను నమ్మిన కుటుంబాలు అండగా ఉండి వారి జీవితాల్లో ఆనందం పంచవచ్చు.

- మేడ్చల్, రాజముద్ర న్యూస్

**సొంత వారిని కాటికి పంపుతున్న వైనం**

వివాహేతర సంబంధాలు కన్నవారికి సొంత ఊరికి చెడ్డపేరు తీసుకొచ్చి చివరికి కటకటాల్లోకి చేరి ఊచలు లెక్క పెట్టాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి.. ప్రియుడి మోజులో పడి కన్న తల్లిని కడతీర్చడానికి ఒడిగట్టిన ఘటన జిల్లాలో చోటు చేసుకుంది. ఇలాంటి ఘటనలు జిల్లాలో కొన్ని ఉన్నాయి. టీవీ సీరియల్ లు... ఓటీటీలో వచ్చే అడల్ట్ కంటెంట్ ఆలోచనలను పెడదోవ పట్టి స్తున్నాయని అందుకని బి కేర్ ఫుల్ అంటున్నారు పోలీస్ అధికారులు.. తమ సంబంధాలకు అడ్డువస్తే సొంతవారైన కనికరం లేకుండా.. వివాహేతర సంబంధాల మోజులో పడి క్షణికానందం కోసం పరితపించి సొంత మనుషులను రక్తం పంచుకొని పుట్టిన బిడ్డలను సైతం కనికరం లేకుండా కడతేర్చుతున్నారు. తమకు కావాల్సింది దక్కితే సరిపోతుంది అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు సొంత మనుషులైన ఇతరులైన మాకేం పట్టదు అన్నట్లు వ్యవహరించి తమ సంబంధాలకు అడ్డువస్తే అడ్డు తొలగించుకుంటున్నారు. చేసిన పాపం పండి కటకటాల పాలవుతున్నారు. ఫలితంగా ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంటుంది ఇక ఆయా ఘటనలో కుటుంబ పెద్ద మరణించిన జైలుకెళ్లిన ఆ కుటుంబం మాత్రం పెద్ద దిక్కు కోల్పోయి రోడ్డు పాలవుతుంది. క్షణీ కానందం కోసం వెంపర్లాడేవారు ఒక్కక్షణం ఆలోచించుకోవాలి వివాహేతర సంబంధాల జోలికి వెళ్లకుండా తమను తాము నియంత్రించుకోవాలి. జాగ్రత్త పడితే తమను నమ్మిన కుటుంబాలు అండగా ఉండి వారి జీవితాల్లో ఆనందం పంచవచ్చు. చక్కని భవిష్యత్తు ఇచ్చి వారికి జీవితాంతం అండగా ఉండే అవకాశం ఉంటుంది.



## దిగజారుస్తున్న కుటుంబ విలువలు

కొన్ని సందర్భాల్లో కుటుంబ పెద్దను కట్టుకున్న భార్య, భర్తను అంత మోదించిన ఘటనలు ప్రస్తుతం రాష్ట్రంలో చాలా చోటు చేసుకున్నాయి. ఇలాంటి ఘటనల్లో ఆ కుటుంబంలో ఉన్న చిన్నారులు అనాధలవుతారని ఆలోచన వారికి లేదు. జీవితాంతం కుటుంబంతో సాఫీగా సాగి భార్యాపిల్లలు, తల్లిదండ్రులు, బంధువులు ఇలా అందరితో కలిసి మీరు తీసుకున్న కొత్త జీవితం నిర్ణయంతో జీవించి పంచుకునే ఆనందం వెలకట్టలేనిది. కుటుంబ వ్యవస్థకు సగటు మంచి ప్రాధాన్యమిచ్చి దానికి కట్టుబడి జీవించిన నాడే ఇలాంటి దారుణాలు క్రమేపి తగ్గుముఖం పడతాయి. మన దేశ ఔన్నత్యం మరింత ఇనుమడింపే చేసి కుటుంబ పాలనపై ఉన్న నమ్మకాన్ని నిలబెడుతుంది. ఇలా జరిగిన ప్రతి సంఘటన వెనుక అక్రమ సంబంధాలే ఎక్కువగా ఉన్నాయి. అయితే కుటుంబ విలువలు దిగజారిపోతూ వివాహేతర సంబంధాల మోజులో పడి పచ్చని సంసారాలు అక్రమ సంబంధాలతో సొంత వారిని కాటికి పంపుతున్న వైనం సమాజంలో అందరినీ కలిసి వేస్తుంది.

## పచ్చని కాపురాల్లో చిచ్చు...:

భారతదేశం అంటే నీ కుటుంబ వ్యవస్థ కుటుంబ విలువలకు పెట్టింది పేరు విదేశీయులు సైతం మన దేశానికి వెలువనిచ్చే అంశంలో కుటుంబ వ్యవస్థకే మొదటి ప్రాధాన్యం దక్కుతుంది అనడంలో అతిశయోక్తి లేదు. ఇలాంటి దేశంలో మారుతున్న ప్రపంచీకరణ సోషల్ మీడియా ఎఫెక్ట్ అరచేతిలో ఇమిడి పోయే ఫోన్లు.. అంతరాయం లేకుండా వచ్చే ఇంటర్నెట్ కారణంగా విలువలు సమాధి చేయబడుతున్నాయి. ఇంటర్నెట్లో వచ్చే వాటిని చూడటం వాటి కోసం వెంపర్లాడటం క్షనికానందం కోసం అక్రమ సంబంధాలు పెట్టుకోవడం అవి బయటపడ్డ నాడు భార్యాభర్తల నడుమ గొడవలు మోసం చేస్తున్నారని ప్రతీకారాలు కుట్ర చేయడం.. చివరకు కడ తేర్చే వరకు వెళ్లడం వంటి ఘటనలు వెంటవెంటనే జరిగిపోతున్నాయి. ఈ క్రమంలో తమను నమ్మిన కుటుంబాలు ఏమైపోతాయని ఒక్క క్షణం కూడా ఆలోచించడం లేదు. దీంతో కుటుంబ పెద్ద అర్ధాంతరంగా కన్నుమూసిన.. కటకటాల పాలైన తమను నమ్మిన కుటుంబం అంతా రోడ్డు పాలవుతుంది. ఫలితంగా కుటుంబం ఎన్నో ఏళ్ళు ఆర్థిక ఒడిదుడుకులకు గురయ్యే ప్రమాదం ఉంది. దీని కారణంగా కుటుంబంలో చిన్నారులు ఉంటే వారి చదువు భవిష్యత్తుపై ఎంతో ప్రభావం చూపుతుంది.





హార్దిక్ ఎమోషన్.. పిచ్‌పై మట్టి రుచి చూసిన రోహిత్

2024 ప్రపంచ కప్ ముందు వరకు ముంబయి ఇండియన్స్ కెప్టెన్సీ విషయంలో రోహిత్, హార్దిక్ మధ్య విభేదాలు ఉన్నాయనే వార్తలు వచ్చాయి. అయితే, ఫైనల్ అనంతరం వాటన్నింటికి చెక్ పడింది. హార్దిక్ కన్నీళ్లు పెట్టుకుని భావోద్వేగానికి గురికాగా.. రోహిత్ అతడిని హత్తుకుని ఓదార్చాడు. టీమ్ఇండియాకు రెండో టీ20 ప్రపంచ కప్ అందించిన బార్బడోస్ మైదానం పిచ్‌ను జీవితాంతం గుర్తుంచుకునేలా.. రోహిత్ పిచ్‌పై ఉన్న మట్టిని నోట్లో వేసుకున్నాడు. అప్పట్లో ఈ వీడియో వైరల్‌గా మారింది.

'రోబో'లా హిట్‌మ్యాన్.. చరిత్రలో నిలిచిపోయే సూర్య క్యాచ్

టీ20 ప్రపంచ కప్‌ను అందుకొనే సమయంలో రోహిత్ 'రోబో'లా వచ్చాడు. డబ్ల్యూడబ్ల్యూఈ స్టార్ రిక్ ఫ్లెయిర్ స్టైల్‌లో ఇలా చేశాడు. రోహిత్‌ను ఇలా రమ్మని కుల్‌దీప్ యాదవ్ చెప్పాడు. చివరి ఓవర్‌లో మొదటి బంతికి డేవిడ్ మిల్లర్ ఇచ్చిన క్యాచ్‌ని బౌండరీ లైన్ వద్ద తన శరీర బరువును నియంత్రించుకుంటూ సూర్యకుమార్ యాదవ్ అద్భుతంగా అందుకున్నాడు. అప్పటికి సఫారీల చేతిలో ఉన్న మ్యాచ్ ఈ క్యాచ్‌తో భారత్ వైపు మళ్లింది. ఈ క్యాచ్ సూర్య కెరీర్‌లోనే కాకుండా భారత క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

# 17 ఏళ్ల తర్వాత నెరవేరిన పొట్టి కప్ కల..

## రోహిత్, కోహ్లీల వీడ్కోలుకు నేటికి ఏడాది



భారత క్రికెట్‌లో జూన్ 29, 2024కు ఓ ప్రత్యేకత ఉంది. టీమ్ఇండియా రెండో టీ20 ప్రపంచ కప్ సాధించి సరిగ్గా నేటికి ఏడాది. రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు బార్బడోస్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో 7 పరుగుల తేడాతో గెలిచి విశ్వవిజేతగా నిలిచింది. 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత భారత్ పొట్టి కప్పును సాధించడం విశేషం. ఈ మ్యాచ్ ముగిసిన అనంతరం రోహిత్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ టీ20 కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. 2024 టీ20 వరల్డ్ కప్ సాధించి రాహుల్ ద్రవిడ్ కూడా సగర్వంగా కోచ్ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యాడు. వరల్డ్ కప్ గెలిచిన తర్వాత ఆటగాళ్లంతా అతడిని ఎత్తుకొని సంబరాలు చేసుకుని గొప్పగా వీడ్కోలు పలికారు.

### కోహ్లీ, అక్షర్ కీలక ఇన్నింగ్స్‌లు

టోర్నీలో విఫలమైన కోహ్లీ.. (76, 59 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫైనల్‌లో మాత్రం అదరగొట్టాడు. రోహిత్ (9), పంత్ (0), సూర్యకుమార్ (3) విఫలమైన వేళ క్రీజులోకి వచ్చిన అక్షర్ పటేల్ (47, 31 బంతుల్లో) కూడా విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో భారత్ 7 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. బౌలింగ్‌లో హార్దిక్ పాండ్య (3/20), బుమ్రా (2/18), అర్ష్‌దీప్ (2/20) సమష్టిగా రాణించి సఫారీలను 169/8కి కట్టడి చేసి భారత్‌కు చిరస్మరణీయమైన విజయాన్ని అందించారు.

# అభివృద్ధి పేరుతో దందా..

## మరో వివాదంలో హెచ్‌సీఏ

### 136 క్లబ్‌లకు రూ.4 కోట్లు

### కార్యదర్శి సంతకం లేకుండానే చెల్లింపులు

**హైదరాబాద్ :** అవినీతి వ్యవహారాలతో తరచుగా వార్తల్లో నిలిచే హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) మరో వివాదంలో చిక్కుకుంది. ఆదివారం సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరగబోతుండగా.. హడావుడిగా 136 క్లబ్‌లకు ఒక్కో దానికి రూ.3 లక్షల చొప్పున రూ.4 కోట్ల రూపాయల మొత్తాన్ని పంచడం చర్చనీయాంశంగా మారింది. క్లబ్‌ల అభివృద్ధి కోసం ఈ నిధులను ఇచ్చినట్లు హెచ్‌సీఏ పెద్దలు చెబుతున్నప్పటికీ.. చెల్లింపులు జరిగిన తీరు అనుమానాలకు తావిస్తోంది. ఏజీఎంలో క్లబ్‌ల నుంచి వ్యతిరేక గళాలు వినిపించకుండా చూడడంతో పాటు భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల్లో ప్రయోజనం పొందడం కోసమే ఈ చెల్లింపులు చేశారని.. దీని వెనుక హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావుతో పాటు ఇతర ఆఫీస్ బేరర్లు ఉన్నారని.. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని తెలంగాణ అవినీతి నిరోధక విభాగం అధికారులకు ఫిర్యాదులు వెళ్లడం గమనార్హం. హెచ్‌సీఏలో ఏ చెల్లింపులు చేయాలన్నా కార్యదర్శి ఆమోదం తప్పనిసరి. కానీ కార్యదర్శి దేవరాజ్ అందుబాటులో లేకపోయినా, ఆయన సంతకం లేకుండానే చెల్లింపులు పూర్తయ్యాయి. గురువారం అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించగా.. దానికి కార్యదర్శి వ్యక్తిగత కారణాలతో దూరంగా ఉన్నారు. ఆ సమావేశంలో మిగతా ఆఫీస్ బేరర్ల ఆమోదంతో ఒక్క రోజులో క్లబ్‌లకు రూ.4 కోట్ల రూపాయలు పంచేశారు. ఇంత హడావుడిగా, నిబంధనలకు విరుద్ధంగా క్లబ్‌లకు నిధులను పంచడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## 'పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు'

### ఆర్సీబీ స్టార్ క్రికెటర్‌పై సీఎంకు యువతి ఫిర్యాదు



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బౌలర్ యశ్ దయాళ్ వివాదంలో చిక్కుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనను మోసం చేశాడని ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన ఓ యువతి తీవ్ర ఆరోపణలు చేసింది. యశ్ దయాళ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ యూపీ సీఎం ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసింది. గత ఐదేళ్లుగా అతడు తనతో రిలేషన్‌షిప్‌లో ఉన్నాడని.. కాబోయే కోడలు అంటూ ఇంట్లో పరిచయం చేసి ఆ తర్వాత శారీరకంగా, మానసికంగా హింసకు గురిచేశాడని ఆమె పేర్కొంది. కొంత కాలం తర్వాత అతడికి ఇతర అమ్మాయిలతో సంబంధాలున్నాయని తెలిసిందని ఫిర్యాదులో తెలిపారు. దీనిపై జూన్ 14న మహిళల హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశానని.. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దీంతో న్యాయం కోసం ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ఆశ్రయించినట్లు సదరు యువతి తెలిపింది. యశ్ దయాళ్‌తో దిగిన ఫొటోలు, వీడియో కాల్స్, చాటింగ్ స్క్రీన్ షాట్లను పోలీసులకు ఆధారాలుగా చూపించానని.. అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. యువతి చేసిన ఫిర్యాదుపై ముఖ్యమంత్రి కార్యాలయం.. ఘజియాబాద్‌లోని ఇందిరాపురం సర్కిల్ ఆఫీసర్ నుంచి నివేదిక కోరిందని సమాచారం.

## ఎఫ్‌డీఐ గమ్యస్థానాల్లో

# భారత్‌కు 15వ స్థానం



దిల్లీ: గతేడాది విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను అందుకున్న దేశాల్లో, ప్రపంచవ్యాప్తంగా భారత్ 15వ స్థానంలో నిలిచిందని యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యూఎన్‌సీటీఏడీ) నివేదిక వెల్లడించింది. 2023లో 28.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.42 లక్షల కోట్ల) ఎఫ్‌డీఐ మన దేశంలోకి తరలి రాగా 16వ స్థానంలో నిలిచింది. 2024లో 27.6 బి.డాలర్ల (సుమారు రూ.2.37 లక్షల కోట్ల) ఎఫ్‌డీఐ వచ్చినా ఒక స్థానం మెరుగవడం గమనార్హం. ఈ నివేదిక ప్రకారం..

- కొత్త ప్రాజెక్టు ప్రకటనలు పెరిగాయి. 2024లో 1,080 ప్రాజెక్టులను ప్రకటించారు. ఇందులో అంతర్జాతీయ ప్రాజెక్టు ఫైనాన్స్ ఒప్పందాలు సాధించిన అగ్రగామి 5 ఆర్థిక వ్యవస్థల్లో మన దేశం ఉంది. ఇలాంటి లావాదేవీలు 97 జరిగాయి.
- రెండు విభాగాల్లోనూ అమెరికా అగ్ర స్థానంలో ఉంది. భారత్‌తో పోలిస్తే అమెరికాలో కొత్త ప్రాజెక్టులు, అంతర్జాతీయ ప్రాజెక్టు ఫైనాన్స్ ఒప్పందాలు రెండింతలుగా ఉన్నాయి. అంతర్జాతీయంగా ఎఫ్‌డీఐ సాధించిన దేశాల్లో 279 బి.డాలర్లతో అమెరికాలో తొలి స్థానంలో ఉంది. 2023లో 233 బి.డాలర్ల ఎఫ్‌డీఐ అమెరికాకు వెళ్లింది.
- చైనాకు ఎఫ్‌డీఐ 29 శాతం తగ్గడంతో 2024లో నాలుగో స్థానానికి పడిపోయింది. వరుసగా రెండో ఏడాదీ చైనాలోకి ఎఫ్‌డీఐ తగ్గింది. 2023లో చైనా రెండో స్థానంలో ఉంది.
- ఆసియా దేశాల్లోకి ఎఫ్‌డీఐ 10% పెరిగి 225 బి.డాలర్లకు చేరింది. ఇది సరికొత్త రికార్డు. గణనీయ స్థాయిలో కొత్త ప్రాజెక్టులు మొదలవుతున్నా, మన దేశంలోకి ఎఫ్‌డీఐ 2023తో పోలిస్తే 2% తగ్గింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోకి ఎఫ్‌డీఐ రాక బలంగా ఉండటంతో పశ్చిమాసియాలోకి ఎఫ్‌డీఐ అత్యధిక స్థాయికి చేరింది.
- ఇతర దేశాల్లోకి మన పెట్టుబడులు వెళ్లే విషయంలో భారత్ అంతర్జాతీయంగా 18వ స్థానంలో ఉంది. మన దేశం నుంచి 24 బి.డాలర్ల పెట్టుబడులు ఇతర దేశాలకు వెళ్లాయి. 2023లో 14 బి.డాలర్లతో 23వ స్థానంలో ఉంది.
- భారత్, సౌదీ అరేబియాల ర్యాంకులు 2023తో పోలిస్తే మెరుగయ్యాయి. భారతీయ పెట్టుబడిదార్లు ప్రకటించిన కొత్త ప్రాజెక్టుల సంఖ్య 2% పెరిగింది. దీంతో అగ్రగామి 10 పెట్టుబడి దేశాల్లో భారత్ స్థానం సాధించింది.
- సెమీ కండక్టర్లు, వాహనాల పరిశ్రమలో కొత్త ప్రాజెక్టులు అమెరికాలో అధికంగా ఉన్నాయి. సెమీ కండక్టర్లు, ప్రాథమిక లోహాలపై మన దేశ పెట్టుబడిదార్లు పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారు. న్యూ బ్యాటరీ, ఈవీ (విద్యుత్తు వాహనాల) అసెంబ్లింగ్ ప్లాంట్లను అమెరికా, భారత్, ఐరోపా దేశాల్లో ప్రకటించారు.
- 2023తో పోలిస్తే 2024లో అంతర్జాతీయ ఎఫ్‌డీఐ 11% క్షీణించి 1.5 లక్షల కోట్ల డాలర్లకు పరిమితమైంది. రెండంకెల క్షీణత నమోదు కావడం ఇది రెండోసారి. అంతర్జాతీయ ప్రాజెక్టు ఫైనాన్స్ ఒప్పందాలు 27% క్షీణించాయి. ప్రధాన ఆర్థిక వ్యవస్థలైన చైనా, భారత్‌లలోనూ పెట్టుబడి కార్యకలాపాలు తగ్గాయి.

## రోజుకు మరో 10 లక్షల బ్యారెళ్ల

# చమురుకు గిరాకీ

### 2030 కల్లా భారత్‌పై ఐఈఏ అంచనా



**దిల్లీ:** ప్రపంచంలో చమురు వినియోగం, దిగుమతి పరంగా మూడో స్థానంలో ఉన్న భారత్‌లో.. 2030 నాటికి రోజుకు మరో 10 లక్షల బ్యారెళ్ల చమురుకు గిరాకీ లభిస్తుందని అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ ఐఈఏ తాజా నివేదికలో అంచనా వేసింది. ఈ దశాబ్దం ఆఖరుకు అంతర్జాతీయంగా చమురుకు గిరాకీ, ప్రస్తుతం కంటే రోజుకు 25 లక్షల బ్యారెళ్ల మేర పెరిగి మొత్తం 10.55 కోట్ల బ్యారెళ్లకు చేరుకుంటుందని తెలిపింది. పశ్చిమాసియాలో పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు.. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు కొంతమేర చమురు విపణి భవిష్యత్‌పై ఆందోళనలు పెంచుతున్నాయని వివరించింది. చమురు శుద్ధి కర్మాగారాల్లో (రిఫైనరీల్లో) పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలుగా మార్చేందుకు వినియోగించే ముడి చమురుకు భారత్‌లో గిరాకీ 2024లో రోజుకు 56.4 లక్షల బ్యారెళ్లుగా ఉంది. 2030 నాటికి మరో 10 లక్షల బ్యారెళ్ల మేర పెరిగి 66.6 లక్షల బ్యారెళ్లకు చేరుకుంటుందని ఐఈఏ అంచనా వేసింది. భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) గణనీయంగా పెరిగే అవకాశం ఉండటమే ఇందుకు కారణమని, ఏ ఇతర దేశాల్లోనూ ఈ స్థాయిలో గిరాకీ పెరిగే అవకాశం లేదని తేల్చింది. అయితే భారత్‌లో ఉత్పత్తి తగ్గుముఖం పడుతున్నందున, చమురు అవసరాల కోసం దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తుందని వివరించింది. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా ముడి చమురును వినియోగించే దేశాల్లో తొలి స్థానంలో ఉన్న అమెరికాలో 2025లో గరిష్ఠంగా రోజుకు 2.047 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు (2024లో 2.042 కోట్ల బ్యారెళ్ల) కు గిరాకీ ఉంటుందని పేర్కొంది. అయితే 2030 నాటికి ఈ గిరాకీ కొంత తగ్గి, రోజుకు 2.001 కోట్ల బ్యారెళ్లకు పరిమితమవుతుందని చెప్పింది. చైనాలో చమురుకు గిరాకీ 2027 నాటికి గరిష్ఠ స్థాయికి చేరుతుందని, రోజుకు 1.695 కోట్ల బ్యారెళ్ల చమురుకు గిరాకీ లభిస్తుందని తెలిపింది. 2024లో ఇది 1.663 కోట్ల బ్యారెళ్లుగా ఉంది. 2030 నాటికి గిరాకీ తగ్గుముఖం పట్టి రోజుకు 1.666 కోట్ల బ్యారెళ్లకు పరిమితమవుతుందని వెల్లడించింది.

ముడి చమురు ఉత్పత్తి భారత్‌లో 2030 నాటికి రోజుకు 30,000 బ్యారెళ్ల మేర తగ్గి, 6,70,000 బ్యారెళ్లకు పరిమితమవుతుందని పేర్కొంది. 2030 నాటికి చైనా ప్రపంచంలోనే అతి పెద్ద చమురు శుద్ధి దేశంగా (రోజుకు 1.95 కోట్ల బ్యారెళ్ల సామర్థ్యంతో) ఉంటుందని, తర్వాత స్థానంలో 1.77 కోట్ల బ్యారెళ్లతో అమెరికా, 71 లక్షల బ్యారెళ్లతో రష్యా, 68 లక్షల బ్యారెళ్లతో భారత్ ఉంటాయని ఐఈఏ అంచనా వేసింది.

## పసిడి తనఖా రుణాలకు కొత్త నిబంధనలు

# కంపెనీలపై ప్రభావమెంత?



దిల్లీ: పసిడి తనఖా రుణాల విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఇటీవల తీసుకొచ్చిన కొత్త నిబంధనల వల్ల, ఆర్థిక సంస్థలు తమ వ్యాపార నమూనాలను సర్దుబాటు చేసుకోవాల్సి వస్తుందని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ చెబుతోంది. కార్యకలాపాల సామర్థ్యం, సేవల తీరు ఆయా సంస్థల మధ్య అంతరానికి కీలకంగా మారనున్నాయని పేర్కొంది. రూ.2.5 లక్షల్లోపు పసిడి రుణాలకు తాకట్టు పెట్టే పసిడి విలువలో 75 శాతంగా ఉన్న రుణ నిష్పత్తి (ఎల్‌టీవీ)ని 85 శాతానికి పెంచుతున్నట్లు ఈ నెల మొదట్లో ఆర్‌బీఐ ప్రకటించింది. రూ.2.5–5 లక్షల రుణాలకు ఎల్‌టీవీ నిష్పత్తి 80 శాతంగా.. రూ.5 లక్షలకు పైబడ్డ రుణాలకు 75 శాతంగా నిర్ణయించింది. ఈ మార్పులు చేసేందుకు 2026 ఏప్రిల్ 1 వరకు రుణదాతలకు సమయం ఉంది. కొత్త నిబంధనల వల్ల ఆయా రుణాలిచ్చే సంస్థల పోటీతత్వంలో మార్పు రానుందని ఎస్ అండ్ పీ అంటోంది. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) నష్టనివారణ విధానాలను అభివృద్ధి చేసుకోవాల్సి వస్తుంది. రుణం తీసుకునే వ్యక్తికి, ఆ రుణాన్ని తిరిగి చెల్లించే సామర్థ్యం ఉందో లేదో తెలుసుకునే ప్రక్రియలనూ సంస్థలు అభివృద్ధి చేసుకోవాల్సి వస్తుంది. 'సాధారణంగా తాకట్టు పెట్టిన పసిడి విలువపైనే వాళ్లు ఆధారపడుతుంటారు. తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని మదింపు చేసేందుకు లోన్ ఆఫీసర్లను నియమించుకోవడంతో పాటు, తగిన శిక్షణ ఇవ్వాల'ని వివరించింది.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# నాకు అవసరమైన దానికంటే ఎక్కువే ఇచ్చాయి..

నటి
షాలిని పాండే
సెన్సేషనల్ మూవీ అర్జున్ రెడ్డి సినిమాతో టాలీవుడ్ సినీ ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది నటి షాలిని పాండే. తెలుగు మాట్లాడడం రాకపోయినా ఆ సినిమాలో తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకుంది. తర్వాత 100% కాదల్, మహానటి వంటి చిత్రాలలో నటించి మెప్పించింది. 2017 లో విడుదలైన అర్జున్ రెడ్డి సినిమాలో విజయ్ దేవరకొండ సరసన నటించి.. మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ సినిమాలో ఆమె ప్రీతి పాత్రలో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఇకపోతే ఈ ముద్దుగుమ్మ తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. హిమాచల్ ప్రదేశ్‌లో షూటింగ్ గ్యాప్‌లో ఎంజాయ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ సందర్భంగా "మనాలికి ఒక చిన్న ప్రేమలేఖ. ఒక ప్రాజెక్ట్ కోసం షూటింగ్ చేస్తూ, పర్వతాల ఒడిలో నివసిస్తూ, ఇంటి నుండి దూరంగా ఒక లయలో స్థిరపడటానికి ప్రయత్నిస్తూ, నేను ఇక్కడ ఒక నెల గడిపాను. నేను ప్రతి రోజు నా చిన్న కుక్కలను చాలా మిస్ అయ్యాను. నిశ్శబ్దం భారంగా అనిపించే క్షణాలు అవి. అయినప్పటికీ, నెమ్మదిగా, మనాలి నన్ను పట్టుకోవడం ప్రారంభించింది. నా పక్కన కూర్చున్న హిమాచలి కుక్కల ప్రేమలో మునిగితేలుతున్నాను. తెల్లవారుజామున నిశ్శబ్దంగా ఉన్న పైన్ వాసనలో ఫీలింగ్ చాలా బాగుంది. నేను ఎవరో సున్నితమైన జ్ఞాపకాలుగా భావించే ప్రదేశాలు.. ఎప్పుడూ ఏమీ అడగకుండా నాకు అన్నీ ఇచ్చిన పట్టణం నిశ్శబ్ద, ఉదారమైన ప్రేమ.. నా రోజుల్లో మనాలి దాగి ఉన్న అన్ని మాయాజాలం కోసం ఈ చిన్న గమనికను ఇక్కడ వదిలివేస్తున్నాను. నా హృదయంలో ఒక నిశ్శబ్ద భాగం ఎల్లప్పుడూ హిమాచల్‌ప్రదేశ్‌కు



# అది ముగిసిందంటూ నటి పోస్ట్..

ఒక నటిగా, మోడల్, నృత్య కొరియోగ్రాఫ్గా జనాల్లో.. తెలుగు చిత్ర పరిశ్రమలో ఒక ప్రముఖ నటిగా పేరు సంపాదించుకున్నారు తేజస్వి మదివాడ. 2011లో తేజస్వి మిస్ డాబర్ గులాబారి అందాల పోటీలో సెకండ్ రన్నరప్ గా నిలిచింది. ఇది ఆమెకు మొదటి సినిమా పాత్రను అందించడానికి దారితీసింది. తర్వాత 2013లో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయమయ్యింది. తేజస్వి 2014లో కమర్షియల్ హిట్ ఐస్ క్రీమ్ సినిమాలో నటించినప్పటి నుంచి మరింత ఫేమ్ దక్కించుకుంది. రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఐస్ క్రీమ్ చిత్రంతో ఆమె హీరోయిన్గా గుర్తింపు పొందింది. అయితే తాజాగా ఈ నటి నెట్టింట "కాకమ్మ సీజన్ 2 ముగింపు కోసం.. పోల్కరింతలు' అంటూ ఓ క్యాప్షన్ రాసుకొచ్చి పోస్ట్ పెట్టింది. అలాగే పోస్ట్‌లో పిక్స్ కూడా పంచుకుంది. కనిపించి, కనిపించని ఎద అందాలతో ఓ స్టైలిష్ డ్రెస్ ధరించి.. డిఫరెంట్ హెయిర్ స్టైల్‌లో కుర్రాళ్లను కుదురుగా ఉండనివ్వడం లేదు. ఈ పోస్ట్ వీక్షించిన నెటిజన్లు విపరీతంగా బోల్డ్ కామెంట్లు చేస్తున్నారు. కనపడవు కానీ సో హాట్ డియర్ అంటూ ఘాటుగా స్పందిస్తున్నారు.



# సూర్య డైరెక్షన్‌లో పాన్ ఇండియా మూవీ.. హీరోయిన్ ఫిక్స్!

యాక్టర్‌గా, డైరెక్టర్‌గా, మల్టీ టాలెండటెడ్‌గా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నాడు ఎస్.జె. సూర్య. 'వాలి', 'ఖుషి', 'న్యూ' వంటి మిట్ చిత్రాలను అందించిన సూర్య.. ఇప్పుడు పదేళ్ల గ్యాప్ తర్వాత మళ్లీ దర్శకునిగా రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు. ఈయన రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'కిల్లర్'. ఇందులో ఎస్.జె సూర్య హీరోగా నటిస్తుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ గోకులం మూవీస్‌తో కలిసి సూర్య తన సొంత నిర్మాణ సంస్థ ఏంజెల్ స్టూడియోస్‌పై నిర్మిస్తున్నాడు. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ఏకంగా ఐదు భాషలలో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నట్లు ఇప్పటికే నిర్మాతలు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే.. ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన మరో ఇంట్రెస్టింగ్ బజ్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్ ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. ఇందులో యంగ్ బ్యూటీ ప్రీతి అస్రాని(%ాతీవవిఱ-ాంతీఱఅఱ%)ని హీరోయిన్‌గా ఎంపిక చేశారట మేకర్స్. ఇప్పటికే చర్చలు జరపగా.. దాదాపు ఓకే అయినట్లు తెలుస్తుంది. అలాగే దీనిపై త్వరలో అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశం ఉన్నట్లు టాక్. కాగా.. ప్రీతి అస్రాని 'ప్రెజర్ కుక్కర్' సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయి.. 'ఎ', 'సీటీమార్', 'యశోద' వంటి చిత్రాలతో మంచి క్రేజ్ తెచ్చుకుంది

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com